నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433

E-mail:netinijam93@gmail.com

నేటి కందం-నేటికి అందం

బీ యే యస్ కే కేంద్రము
పాయని యేర్పాటు పెద్ద పల్లి నగరిలో
తీయని కబురై వచ్చెను
ధ్యేయము గల నవయువతకు తీర్పగ కాంక్షల్ !!

(తెలంగాణా అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్-బీ యే యస్ కె. కేంద్రం పెద్దపల్లిలో స్థాపించబడింది. దీనితో తెలంగాణా లోని యువతకు సామర్థ్యమూ, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి.)

-రాధశ్రీ

సెల్:9494481210



చురక

తమ్ముడిహెట్టి బ్యారేజీ
తెరపైకి వచ్చింది
కడుతానంటే హస్తం
కారుకేమి నొచ్చింది.
అదిలోనే హంసపాదు
అడ్డకాలు పెద్ద తప్పు
ప్రభుత్వం మంచి చేస్తే
ప్రతిపక్షంకేమి ముప్పు.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 28-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:75 పేజీలు:6 వెల: రూ.1/-

ఘోర రోడ్డు ప్రమాదం.. డ్రైవర్ మృతి

లారీని ఢీ కొట్టిన గ్రానైట్ లోడ్ తో వెళుతున్న లారీ
ఇంజన్ క్యాబిన్ పై గ్రానైట్ రాయి పడిపోవడంతో డ్రైవర్ మృతి
రోడ్డుపై పడిపోయిన గ్రానైట్ రాళ్లు
బైపాస్ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



ఖమ్మం, అక్టోబర్ 27:ఖమ్మం జిల్లా వైరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ బైపాస్ పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం దేవరపల్లి మార్గంలోని లక్ష్మీపురం బ్రిడ్జి సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని గ్రానైట్ లోడుతో ఉన్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భారీ గ్రానైట్ రాయి లారీ ఇంజన్ క్యాబిన్‌పై పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వైపు గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీ (TS 02 UB 8906), అదే దిశలో కల్లూరు వైపు ప్రయాణిస్తున్న మరో వాహనాన్ని (KA 56 9236) బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు లారీలో ఉన్న భారీ గ్రానైట్ రాళ్లు ముందుకొచ్చి డ్రైవర్ క్యాబిన్‌పై పడ్డాయి. దీంతో క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయి, లోపల చిక్కుకుపోయిన డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, బీర్భూమ్ జిల్లా ఖిదిర్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ అనికుల్ (29) (తండ్రి: మస్రుల్ ఇస్లాం)గా గుర్తించారు.

ప్రమాద ధాటికి లారీలోని భారీ గ్రానైట్ రాళ్లు రోడ్డుపై చెల్లాచెదరుగా పడటంతో గ్రీన్ ఫీల్డ్ హైవేపై వాహన రాకపోకలు తీవ్రంగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ పుష్పాల రామారావు తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సోమవరం టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించారు. క్రేన్ల సహాయంతో రోడ్డుపై పడిన గ్రానైట్ రాళ్లను తొలగించి, క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

-ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
-పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం. వారి సేవలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం.
- జిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్



ములుగు అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి): అక్టోబర్ 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, నేడు ములుగు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ప్రాణాలరిచించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమం ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల నిస్వార్థ సేవలను, ధైర్యసాహసాలను, ప్రజల రక్షణ కోసం వారు చేసిన ప్రాణత్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు.

కాగా ఈ యొక్క కార్యక్రమ నిర్వాహకుడిగా ఆపరేషన్స్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి తిరుపతి విజయవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ములుగు ఎస్‌డీపీఓ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, సీసీఎస్ సీఐ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అడ్మిన్ స్వామి, ఎంటీఓ వెంకటనారాయణ, వెల్ఫేర్ అండ్ హోంగార్డ్స్ విభాగం శ్రీకాంత్, ఎస్సైలు కృష్ణ ప్రసాద్, ములుగు వెంకటేశ్వర్లు, పస్రా తాజుద్దీన్, నార్లాపూర్ కమలాకర్, తాడ్వాయి జగదీష్, వెంకటాపూర్ చల్లా రాజు, ఎస్ ఐ లు బుట్ట చంద్రశేఖర్, సాయి కృష్ణ, ఆర్ఎస్ఐలు సందీప్, అవినాష్‌తో పాటు క్యూ ఆర్‌టీ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

యమునాలో మళ్లీ విషపు నురగ!

ఢిల్లీలో 168కు చేరిన ఏక్యూఐ..
పలు ప్రాంతాల్లో 'పూర్' కేటగిరీ కాలుష్యం
జహంగీర్‌పురిలో 251, రోహిణిలో 237 నమోదు..
నోయిడా, గ్రేటర్ నోయిడాలోనూ వాయు కాలుష్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం మరోసారి ఆందోళనకు గురిచేస్తోంది. అక్టోబర్ 27, మంగళవారం ఉదయం 8 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 168గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వర్గీకరణ ప్రకారం ఇది 'మోస్తరు' స్థాయి. అయితే, నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్యం 'పూర్' స్థాయికి చేరింది. మరోవైపు యమునా నదిలో కలుషితమైన తెల్లని నురగ మళ్లీ కనిపించడంతో ఢిల్లీ?ఎన్‌సీఆర్ ప్రాంతంలో పర్యావరణ నమన్యలు చర్చనీయాంశమయ్యాయి.

ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత ఆందోళనకర స్థాయిలో నమోదైంది. జహంగీర్‌పురిలో అత్యధికంగా 251 ఏక్యూఐ నమోదవగా, రోహిణిలో 237, ఆర్కే పురంలో 234, ద్వారక సెక్టార్-8లో 223, బవానాలో 216, ఐజీఐ ఢిల్లీలో 214, ఐజీఐ విమానాశ్రయం టెర్మినల్-3 పరిసరాల్లో 211 నమోదయ్యాయి. పంజాబీ బాగ్‌లో 200గా నమోదైంది. సీపీసీబీ వర్గీకరణ ప్రకారం 201 నుంచి 300 మధ్య ఏక్యూఐ ఉంటే 'పూర్' కేటగిరీగా పరిగణిస్తారు.

నోయిడాలోనూ మోస్తరు

ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత భిన్నంగా నమోదైంది. ఆనంద్ విహార్‌లో 175, అలీపూర్‌లో 197, పట్పర్‌గంజ్‌లో 195, చాందినీ చౌక్‌లో 198 ఏక్యూఐ నమోదయ్యాయి. నరేలా ఎన్ఐహెచ్ ప్రాంతంలో 129, జేఎన్‌యూలో 146, ఇగ్నో మైదాన్‌గఢి లో 150గా నమోదైంది. ఈ ప్రాంతాలు 'మోస్తరు' కేటగిరీలో ఉన్నాయి.

ఢిల్లీ పరిసర ప్రాంతాలైన గ్రేటర్ నోయిడాలో 156, నోయిడాలో 143 ఏక్యూఐ నమోదైంది. ముంబైలో 98గా నమోదవడంతో అక్కడ గాలి నాణ్యత 'సంతృప్తికర' స్థాయిలో ఉంది. కాలుష్యం, దుమ్మును తగ్గించేందుకు ఢిల్లీ రహదారులపై యాంటీ స్మాగ్ గన్‌లతో నీటిని చల్లుతున్న దృశ్యాలు కనిపించాయి.

ఢిల్లీ వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, యమునా నదిలోనూ కాలుష్య సమస్య మరోసారి వెలుగులోకి వచ్చింది. కలిందీ కుంజ్ సమీపంలో నది ఉపరితలంపై పెద్దఎత్తున తెల్లని నురగ తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. నదిలో కాలుష్య నియంత్రణ చర్యలపై మరోసారి చర్చ మొదలైంది.

ఏపీపై 'ఆర్నబ్' ఎఫెక్ట్.. జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

అమరావతి, అక్టోబర్ 27: పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆర్నబ్ తుఫాన్ ఏపీ తీరంవైపుకు దూసుకొస్తోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 20 కిలోమీటర్ల వేగంగా కదిలి అతి తీవ్ర తుఫాన్‌గా మారింది. ప్రస్తుతానికి విశాఖపట్నానికి 170 కిలోమీటర్ల, కాకినాడకు180 కిలోమీటర్ల, మచిలీపట్నానికి 270 కిలోమీటర్ల, బాపట్లకు 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే విశాఖ, శ్రీకాకుళం,విజయనగరం, మన్యం, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

ఈరోజు సాయంత్రం నుంచి పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రేపు (బుధవారం) ఉదయానికి బాపట్ల-విశాఖ మధ్య యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తీరం దాటే సమయంలో 125-135 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

మరోవైపు ఆర్నబ్ తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ ప్రస్తుత పరిస్థితి, ముందస్తు సన్నద్ధతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. వివిధ జిల్లాల్లో ఆర్నబ్ తుఫాన్ చూపనున్న ప్రభావం, భారీ వర్షాల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివిధ జిల్లాల కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

'అర్నబ్' ను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధం : ఏపీ హోంమంత్రి

అమరావతి, అక్టోబర్ 27: ముంచుకొస్తున్న 'అర్నబ్ తుపాను ఎదుర్కొనేందుకు రాష్ట్ర యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రాణనష్టం జరగకుండా చూడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు.

విపత్తు నిర్వహణకు సంబంధించిన విభాగాలతో సమన్వయం చేసుకుంటూ తాము పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు.ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ బృందాలు 24 గంటలూ అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. తీరప్రాంత ప్రజలను అవసరమైనప్పుడు వెంటనే తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, అక్కడ స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 1070, 112ను సంప్రదించాలని మంత్రి అనిత సూచించారు.

తెలంగాణలో 1.90 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు: పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబర్ 27: బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు (మంగళవారం) సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 38 బీసీ ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి కార్యాచరణ చేపట్టాలని, కుట్టు మిషన్ల పథకానికి 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

తెలంగాణలోని 327 గురుకులాల్లో 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలిన 301 గురుకులాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు, ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలన్నారు. బీసీలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి వసతులపై ప్రత్యేక కార్యాచరణ.
ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలి.
క్షేత్రస్థాయి పర్యవేక్షణతో నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలి.
జిల్లా కలెక్టర్ బోర్ఢపే హేమంత్ సహదేవరావు.



ములుగు అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి): ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఢపే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.

తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థల పరిస్థితిని ఆవాసాల వారీగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు.

మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో సన్నద్ధత, తాగునీటి వసతులు, జలనిరి పనులు, ఉపాధి కూలీల హాజరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనిదినాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో తాగునీటి సరఫరా మౌలిక వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

గ్రిడ్ ద్వారా ఆవాసాలు, పట్టణ ప్రాంతాలకు అందుతున్న శుద్ధి చేసిన నీటి సరఫరాతోపాటు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు చేరుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు.

ప్రత్యేక కార్యాచరణకు ముందుగా నవంబర్ రెండో వారంలోగా మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇంట్రా, గ్రిడ్ ఏఈలు, ఏఈఈలు, ఎంపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి, రోజువారీ పర్యటనల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లు, స్లూయిస్ వాల్వుల వద్ద లీకేజీలను అరికట్టాలని సూచించారు. ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులను నిర్ణీత తేదీల్లో శుభ్రపరచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ట్యాంకుల మ్యాన్‌హోల్ మూతలు, కీటకాలు ప్రవేశించకుండా ఉండే వెంటిలేటర్ల జాలీలు, మెట్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు.

నీటి శుద్ధికి క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ వినియోగిస్తూ, సరఫరా చివరి ప్రాంతంలో అవశేష క్లోరిన్ స్థాయిని పరీక్షించాలని సూచించారు. అవసరమైన బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఇంటి నల్లా కనెక్షన్ పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచడంతోపాటు నిర్వహణ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.

భూగర్భ జలమట్టాలు తగ్గడం, స్థానిక నీటి వనరులు ఎండిపోవడం, తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ఆవాసాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరుల స్థిరత్వం, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, నీటి నిల్వ సదుపాయాలు, స్థానిక ప్రత్యామ్నాయ వనరులను అంచనా వేయాలన్నారు. సమస్యాత్మక ఆవాసాల వివరాలను కార్యాచరణ ప్రణాళికతో సహా సంబంధిత ఈఈ, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టేలా గ్రామ పంచాయతీలకు సూచనలు ఇవ్వాలన్నారు.

మండల బృందాలు ఆవాసాల వారీగా రోజువారీ నివేదికలను మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ, జిల్లా పంచాయతీ అధికారికి అందించాలని సూచించారు. వాటిని క్రోడీకరించి జిల్లా స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను అవసరానికి అనుగుణంగా మండల, జిల్లా స్థాయి సమావేశాల్లో పరిష్కరించాలన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తూ గ్రామ పంచాయతీలు, ఆవాసాల వారీగా కూలీల హాజరును పరిశీలించి, తక్కువగా ఉన్న చోట పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఉపాధి పనిదినాల కల్పన, సంబంధిత వివరాల నమోదుపై దృష్టి సారించాలన్నారు. గత పనుల చెల్లింపుల్లో ఆలస్యం, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుకు సంబంధించిన సమస్యలను అధికారులు వివరించారు.నీటి కుంటలు, ఇందిరా జలప్రభ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు ట్యాంకులు తదితర పనులకు అంచనాల సమర్పణ నుంచి అనుమతుల మంజూరు వరకు ప్రతి దశను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సిబ్బంది సహకారంతో ఈ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయించే బాధ్యత ఎంపీడీఓలదేనని స్పష్టం చేశారు.

అధికారులు ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు, సిబ్బంది విధులను పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పంచాయతీల వారీగా లక్ష్యాలు కేటాయించాలని, తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి చూపాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓలు కూడా తమ మండల పనులపై పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంతకాల ఫోర్జరీ వంటి తీవ్రమైన ఆరోపణలను సాధారణ పొరపాట్లుగా పరిగణించరాదని స్పష్టం చేశారు. సిబ్బంది తమకు నిర్దేశించిన విధులను నక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని సహించబోమని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి ఆర్ డి ఓ రవీందర్, డి పి ఓ వెంకయ్య, ఆర్ డబ్లూఎస్ సునీత, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

హిందువుల పవిత్ర పర్వదినాలు అట్లతద్ది, కర్వా చౌత్

(28/29 అక్టోబర్ "అట్లతద్ది, కర్వా చౌత్" పర్వదినాల సందర్భంగా)

పండుగలు మన హిందూ సంప్రదాయాల్లో అతి ప్రధానమైనవి. కాయకష్టం చేసుకుంటూ జీవితాలను గడిపే నిరుపేదల కళ్లల్లో ఆనందాల కాంతులు వెదజల్లే బాధ్యతలను పండుగలు తీసుకోవడం హర్షణీయం. పండుగలు ప్రతి ఏటా దక్షిణాదికి చెందిన రాష్ట్రాలు, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో "అట్లతద్ది" పర్వదినాన్ని ప్రపంచవ్యాప్తంగా హిందూ బంధువులు "కర్వా చౌత్" పండుగను ఘనంగా జరుపుకుంటున్నాం.

దక్షిణాదిన అట్లతద్ది పండుగ:

అట్లతద్ది ఆరట్లు..ముద్ద పప్పు మూడట్లు? అంటూ సినీ గేయం పాటతో చేసుకోవడం మనందరికీ తెలుసు. దక్షిణాది రాష్ట్రాల్లో , ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలో "అట్లతద్ది" పండుగను ఆశ్వయుజ బహుళ తదియ నాడు (28 అక్టోబర్) ఉయ్యాల పండుగ అని, గోరింటాకు పండుగ అని కూడా అంటారు. ఈ రోజున కుజదోష నివారణకు పూజలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తోంది. అట్లతద్ది రోజున తమ ఇంట్లో అట్లు వేసి ఒకరికొకరు వాయనంగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఆడ పిల్లలు చెట్లకు ఊయలలు కట్టి సంతోషంగా ఊగుతూ అపూర్వ అనుభూతులను పొందుతారు. వివాహిత మహిళలు తమ భర్తల ఆయురారోగ్యాల కోసం, పెళ్లి కాని అమ్మాయిలు మంచి మొగుడు దొరకాలని అట్లతద్ది నోములు ఆచరిస్తారు.

అట్లతద్ది నోముల పురాణ కథ:

పూర్వం ఓ రాజు కూతురు, ఓ మంత్రి కూతురు, ఓ సేనాని కూతురు, ఓ పురోహితుడి కూతురు నలుగురూ స్నేహంగా కలిసి మెలిసి ఉండేవారు. ఓ రోజు అట్లతద్ది పండుగ వస్తుంది. ఆ రోజు రాత్రి చంద్రుడికి పూజ చేయడానికి వాళ్లు సిద్ధమవుతారు. పెద్దలు దేవీ పూజకు నైవేద్యం సమర్పించడానికి అట్లు వేయడంలో నిమగ్నమై ఉంటారు. ఇంతలో రాజు కూతురు ఆకలితో సొమ్మసిల్లి పడిపోతుంది. వెంటనే రాజకుమారి అన్న తన చెల్లెలికి అద్దంలో తెల్లని వస్తువు చూపి చంద్రోదయం అయ్యింది తెల్లీ అని, కొన్ని పండ్లు తిని సేదదీరి పూజ కొనసాగించమని అంటాడు. అప్పుడు రాకుమారి ఉపవాసం విరమించి ఆహారం తీసుకొని పూజను చేసుకుంటుంది. ఇలా చంద్రోదయం తర్వాత మాత్రమే ఉమాదేవికి పూజలు చేయడం, 9 అట్లు నైవేద్యంగా పెట్టి, వాటిని వాయనం ఇవ్వడం, 9 పువ్వులతో ముడి తోరం కట్టుకుంటారు. ఇలా చేయడం వల్ల మంచి భర్త వస్తాడని నమ్ముతారు. నలుగురు స్నేహితుల్లో రాకుమారికి ముసలి భర్తను ఎంపిక చేస్తారు. మింగిన ముగ్గురికి మంచి యవ్వనులైన భర్తలు వస్తారు. దీనికి దుఃఖించిన రాకుమారి పారిపోయి మర్రి చెట్టు నీడన ఏడ్వడంతో పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై నీ అన్న అజ్ఞానం, నీ మీద ప్రేమ కారణంగా వ్రత భంగం జరగడంతో నీకు ముసలి భర్తను ఎంపిక చేశారని, అట్లతద్ది పూజను సరిగ్గా చేయమని సూచిస్తారు. దానితో యువరాణి మళ్లీ పద్ధతి ప్రకారం అట్లతద్ది నోము చేయడంతో తనకు మంచి అందమైన భర్త లభిస్తాడు. అందువల్ల అట్లతద్ది రోజు చంద్రోదయం తర్వాత మాత్రమే పూజను ముగించి ఆహారం తీసుకోవాలనే ఆచారం ఏర్పడింది.

కర్వా చౌత్ పండుగ:

ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం జరుపుకునే ముఖ్య పర్వదినాల్లో "కర్వా చౌత్" లేదా "కరక చతుర్థి" కూడా ఒకటి కావడం గమనార్హం. శివపార్వతులను పూజించే పండుగగా దీనిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కార్తీకమాసంలో కృష్ణ పక్షం చతుర్థి తిథి రోజున కర్వా చౌత్ పండుగను ఉత్తర భారతం జరుపుకుంటారు. 2025లో కర్వా చౌత్ పండుగ 29 అక్టోబరు రోజున జరుపుకుంటున్నాం. హిందూ పురాణాల ఆధారంగా సావిత్రి తన భర్త ఆత్మ కోసం యముడిని ఈ ఉపవాస దీక్షతో వేడుకుంటుంది. శివుడిని భర్తగా పొందడం కోసం గౌరీదేవి తొలి వ్రతంగా కర్వా చౌత్ పూజలు చేసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి . వివాహిత స్త్రీలు భర్తల దీర్ఘాయుస్సు కోర్ ఉపవాసం ఉంటూ కర్వా మాత(పార్వతీ దేవి)ను పూజిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు తమకు మంచి భర్త రావాలని ఉపవాస పూజలు చేస్తారు. ఈ రోజు మహిళలు సాయంత్రం చంద్రుని దర్శనం తర్వాత భర్త ముఖాన్ని జల్లెడలో చూసి, అతని చేతుల మీదుగా స్త్రీలు ఉపవాసాన్ని విరమిస్తారు.

స్త్రీలు సౌభాగ్యం కోసం చేసుకునే అతి ముఖ్యమైన వ్రతంగా కర్వా చౌత్ లేదా అట్లతద్దిని జరుపుకుంటారు. మన ఆచారాలు, సాంప్రదాయాలు, పండుగలు పబ్బాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ దేవుడు/దేవతల దీవెనలు పొందుతూ ఆనందంగా జీవితాలను గడుపుదాం, ఐక్యత కలిగిన పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.



-మధుపాళీ
9949700037

సిస్టమ్, సింథటిక్ బయాలజీలో భారతదేశ సామర్థ్యాన్ని తెలియజేసే ఈఎస్‌టీఐసీ-2026 సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించిన ఐసీజీఈబీ న్యూఢిల్లీ



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27: ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2026) సన్నాహక కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ (ఐసీజీఈబీ) నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా భారతదేశంలో శాస్త్రీయ పరిశోధన, బయోటెక్నాలజీ, ఆవిష్కరణలను అభివృద్ధి చేయడంలో సిస్టమ్, సింథటిక్ బయాలజీ, వాటికి ఉన్న పరివర్తనాత్మక సామర్థ్యంపై ఒక ప్రత్యేక సమావేశాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ హాజరయ్యారు. బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ) కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎన్ గోఖలే, డీబీటీ సైంటిస్ట్-హెచ్ డాక్టర్ ధనంజయ్ కుమార్ తివారీ, ఐసీజీఈబీ న్యూఢిల్లీ డాక్టర్ రమేష్ వీ సొంటి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించబోయే ఈఎస్‌టీఐసీ-2026 కు సంబంధించిన వివరాలను డాక్టర్ రమేష్ వీ సొంటి తెలియజేశారు. అలాగే సిస్టమ్, సింథటిక్ బయాలజీ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈఎస్‌టీఐసీ?2026లో "సిస్టమ్స్ అండ్ సింథటిక్ బయాలజీ"పై ఓ సెషన్‌ను డీబీటీ నిర్వహిస్తుందని వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న ఈ రంగాలు జీవితంలోని ప్రతి అంశాన్నీ ప్రభావితం చేసాయని, శాస్త్రీయ పురోగతికి గణనీయమైన అవకాశాలను అందిస్తాయని డాక్టర్ సొంటి తెలియజేశారు.

సంక్లిష్ట జీవ వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పారిశ్రామిక బయోటెక్నాలజీ, సుస్థిరాభివృద్ధి రంగాల్లో అప్లికేషన్ల కోసం జీవ ప్రక్రియలను ఇంజినీరింగ్ చేయడంలో అంతర్విభాగ విధానాల ప్రాధాన్యాన్ని సిస్టమ్, సింథటిక్ బయాలజీపై నిర్వహించిన కార్యక్రమం తెలియజేసింది. ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి, నూతన బయోటెక్నాలజీ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి, ప్రపంచ బయో ఎకానమీలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన అవకాశాలను అభివృద్ధి చెందుతున్న ఈ రంగాలు అందిస్తున్నాయి.

ఈ సందర్భంగా బీఐఆర్ఏసీ ఎండీ, డీబీటీ సైంటిస్ట్-హెచ్ డాక్టర్ ధనంజయ్ కుమార్ తివారీ ప్రసంగించారు. సిస్టమ్, సింథటిక్ బయాలజీ సామర్థ్యాన్ని వివరించారు. ఆరోగ్యసేవలు, బయోమ్యానుఫాక్చరింగ్, బయోడిజైన్ రంగాల్లో అనువర్తనాల గురించి తెలియజేశారు. జీవ పరిశోధనను వేగవంతం చేయడంలో కృత్రిమ మేధ పోషిస్తున్న పాత్ర గురించి కూడా వివరించారు. భారతదేశ బయోటెక్నాలజీ రంగానికి కొత్త అవకాశాలను సృష్టించడంలో బయోఈ3 పాలసీకి ఉన్న సామర్థ్యాన్ని తెలియజెప్పారు.

డీబీటీ కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే ప్రసంగిస్తూ.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వాగతం పలికారు. ఆవిష్కరణలు, సామాజిక పురోగతిని నడిపించడంలో విజ్ఞాన శాస్త్రం పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు. విస్తృత స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలుగా శాస్త్రీయ ఆవిష్కరణలు మారి, సమాజానికి అందుబాటులోకి వచ్చినప్పుడే ప్రభావవంతంగా ఉంటాయన్నారు. దీనికి ఉదాహరణగా పెన్సిలిన్ ఆవిష్కరణను, భారీస్థాయి ఉత్పత్తిని చూపించారు. ఆవిష్కరణలకు శక్తివంతమైన వేదికగా జీవశాస్త్రానికి ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. రెండో విప్లవ దశలోకి బయోటెక్నాలజీ ప్రవేశిస్తోందని, మానవ అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలను ప్రభావితం చేసే సామర్థ్యం దీనికి ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశోధన, అభివృద్ధి, విస్తరణను బలోపేతం చేయడం ద్వారా ప్రయోగశాల ఆవిష్కరణలను ఆచరణాత్మక విధానాల్లోకి మార్చే ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని కూడా ఆయన వివరించారు.

పెరుగుతున్న భారతదేశ శాస్త్రీయ సామర్థ్యాలు, జాతీయాభివృద్ధిని నడిపించడంలో, ఆవిష్కరణల వ్యవస్థలను బలోపేతం చేయడంలో, కొత్తగా పుట్టుకొస్తున్న ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో బయోటెక్నాలజీకి ఉన్న అపారమైన సామర్థ్యం గురించి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నీతిఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నిర్దేశించిన దార్శనికత గురించి ప్రస్తావిస్తూ... భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో జీవశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, బయోటెక్నాలజీలకు ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ బయోటెక్నాలజీ రంగాన్ని నడిపించే శక్తిగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు. అలాగే, ప్రాథమిక పరిశోధనను ఆచరణాత్మక అనువర్తనాల్లోకి మార్చాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో, ప్రధాన ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించడంలో ప్రాథమిక జీవశాస్త్ర పరిశోధన ఎలా సాయపడుతుందో వివరించారు. దీనికి కొవిడ్-19 వ్యాక్సిన్ల అభివృద్ధిని ఉదాహరణగా చూపించారు.

ఈఎస్‌టీఐసీ-2026 భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భారతదేశ పరిశోధన, ఆవిష్కరణల ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడంలో కొత్తగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర రంగాల పాత్రపై చర్చలకు నాంది పలికింది.

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం అందిస్తున్న మార్గదర్శకత్వంలో శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమమే ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐస-2026). 2026 అక్టోబర్ 27 నుంచి 29 వరకు ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతుంది. శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, వివిధ రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, పరిశోధనను ప్రభావవంతమైన టెక్నాలజీలుగా మార్చడాన్ని వేగవంతం చేయడానికి ప్రముఖ శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, పరిశ్రమల నాయకులు, పరిశోధకులు, డీప్-టెక్ ఆవిష్కర్తలను ఒక్క చోట చేర్చడమే ఈ సదస్సు లక్ష్యం.

నిస్టమ్ అండ్ సింథటిక్ బయాలజీ, అధునాతన తయారీ, ఎనర్జీ టెక్నాలజీలు, కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు, అధునాతన ఆరోగ్య సేవలతో సహా 12 ప్రధాన రంగాల్లో చర్చలను ఈఎస్‌టీఐసీ నిర్వహిస్తుంది. వికసిత్ భారత్-2047 దార్శనికతకు మద్దతుగా భారత దేశ శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

అత్యాధునిక పరిశోధన, శాస్త్రీయ సహకారం, సామర్థ్య నిర్మాణం పట్ల అంకితభావాన్ని ప్రదర్శిస్తూ... బయోటెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగాలకు భారత్ అందించే తోడ్పాటును బలోపేతం చేయడానికి ఐసీజీఈబీ కట్టుబడి ఉంటుంది.

న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనెటిక్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ (ఐసీజీఈబీ) జీవశాస్త్ర రంగంలో పరిశోధన, శిక్షణను అందించే ముఖ్యమైన సంస్థ. అంటు వ్యాధులు, టీకాలు, రోగనిర్ధారణ, మొక్కల జీవసాంకేతికత, బయోఎనర్జీ, బయోఇన్ఫర్మేటిక్స్, జీవసాంకేతికతలోని ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఈ సంస్థ పరిశోధనలు చేపడుతుంది. శాస్త్రీయ పరిశోధన, సామర్థ్య నిర్మాణం, అంతర్జాతీయ సహకారం ద్వారా మానవ సంక్షేమం, సుస్థిరాభివృద్ధి కోసం జీవసాంకేతికతను ముందుకు తీసుకెళ్లడంలో ఐసీజీఈబీ తన వంతు కృషి చేస్తుంది.

బాలల భద్రత, హక్కులపై అవగాహన

మామడలో పోక్సో చట్టంపై సదస్సు

ఆదిలాబాద్, అక్టోబర్ 27: మామడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'సురక్షిత బచ్పన్ అభియాన్'లో భాగంగా బాలల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ భవిష్య బాలల హక్కులు, పోక్సో చట్టం, చిన్నారులపై జరిగే నేరాల గురించి వివరించారు. బాలలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా ధైర్యంగా పెద్దలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేజేబీ బోర్డు సభ్యుడు డాక్టర్ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహనరావు, ఎస్ఐ హనుమాన్లు, ఉపసర్పంచ్ గోవర్ధన ప్రవీణ్ కుమార్, న్యాయవాదులు రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాశిమెట్లలో డ్రెయిన్లు, సోక్‌పిట్ల నిర్మాణం పరిశీలన

ఆదిలాబాద్, అక్టోబర్ 27: మండలంలోని రాశిమెట్ల గ్రామ పంచాయతీలో నిర్మించిన డ్రెయిన్లు, సోక్‌పిట్లను డీఆర్డీఓ విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు.

గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, మురుగునీరు నిల్వ ఉండకుండా తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోక్‌పిట్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత రమేష్, ఏపీఓ శివాజీ, ఈసీ ఇన్‌చార్జి సురేష్, కార్యదర్శి జావేరియా ఖానమ్, వార్డు సభ్యులు, మేట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం

ర్యాలీ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం

ఆదిలాబాద్, అక్టోబర్ 27: మంచిర్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. హాజీపూర్ మండలంలోని ర్యాలీ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అటవీ ప్రాంతానికి సమీపంలో పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు, పశువుల మేత కోసం అడవులు, పొలాల వైపు వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. పులి ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తుందోనని భయపడుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఒంటరిగా తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పులి కనిపించినా, పాదముద్రలు లేదా ఇతర ఆనవాళ్లు గుర్తించినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పులి కదలికలను గుర్తించి ప్రజలకు భద్రత కల్పించేలా అటవీ శాఖ అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. కాగా, పులి సంచారానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

సాగునీరు, తాగునీటి కోసం బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాదయాత్ర

చెల్లపాడు నుంచి పాదయాత్ర ప్రారంభం.. లిఫ్టుల పునరుద్ధరణకు డిమాండ్



ఆదిలాబాద్, అక్టోబర్ 27: కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చిన్నంబావి మండలంలోని కృష్ణానది తీర ప్రాంతమైన చెల్లపాడు గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ యాత్ర చేపట్టారు. గతంలో శిథిలావస్థకు చేరుకున్న చెల్లపాడు, చిన్నమారు లిఫ్టుల పనులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఇదే ప్రాంతం నుంచి పాదయాత్ర నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సకాలంలో అందించాలని, లిఫ్టుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

అమ్మవారికి బోనాలు సమర్పించిన 30 వేల మంది భక్తులు..

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు



కరీంనగర్, అక్టోబర్ 27:రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని బద్ది పోచమ్మ ఆలయంలో బోనాల జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగింది. జాతర సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు.

తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక ఆనందం నెలకొంది. జాతరకు భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్శనం, బోనాల సమర్పణ సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో రామాదేవి తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు జాతర నిర్వహణను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తూ, జాతర ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నవదీప్‌కు బంగారు పతకం

హన్మకొండ, అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి) హనుమకొండలోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజయం సాధించింది.

ఈ జట్టులో ఆడి బంగారు పతకం సాధించిన కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బండి నవదీప్‌ను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉప సర్పంచ్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సాయన్న విద్యార్థికి పతకం, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

నవదీప్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

విద్యార్థికి ప్రత్యేక శిక్షణ అందించి బంగారు పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల పీడీ వేముల నాగభూషణంను సర్పంచ్, ఉప సర్పంచ్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడం పట్ల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈర్నాల గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

జాతీయ సరస్ మేళా-2026లో... కోట్ల రూపాయల వ్యాపార సంస్థలను నిర్మిస్తున్న 'లఖ్‌పతి దీదీ'ల అనుభవాలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27: నాబార్డ్, ఎన్ఐఆర్‌డీపీఆర్, కుటుంబశ్రీ సంస్థల మద్దతుతో... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో... భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 'జాతీయ సరస్ మేళా'ను నిర్వహిస్తోంది. సాంప్రదాయిక హస్తకళలు, మహిళల వ్యాపార నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ మేళా ఒక చక్కని వేదికగా నిలుస్తోంది. ఆర్థిక స్వాతంత్ర్యం దిశగా మహిళలు సాధించిన అద్భుత విజయాలనూ ఇది ప్రతిబింబిస్తోంది.

పున్నమి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వెనక... ధైర్యంగా ముందడుగు వేసిన మహిళ కథ ఉంది. తమ నైపుణ్యాలను, హస్తకళలను, తమను తామూ నమ్ముకుని 'లఖ్‌పతి దీదీ' కలను ఈ మహిళలు సాకారం చేసుకుంటున్నారు. ఈ మేళా సందర్భంగా కొందరు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఒక చిన్న ఆలోచనను లేదా కుటుంబ సాంప్రదాయిక కళను ఒక పెద్ద వ్యాపారంగా ఎలా మార్చారో వారు వివరించారు. బాధ్యతలను స్వీకరించడం, తమ ఉత్పత్తులను ఆదరించిన నగరాలు, ప్రతి అడుగుతో పెరిగిన ఆత్మవిశ్వాసం గురించి వారు తమ మాటల్లో వివరిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో కొందరు మహిళల వార్షిక వ్యాపార టర్నోవర్ రూ. 60 లక్షల నుంచి రూ. 1 కోటి వరకు ఉండటం విశేషం.

పున్నమి ఘాట్‌లోని స్టాళ్ల గుండా నడిచి వెళ్తున్నప్పుడు అక్కడ ఏర్పాటు చేసిన ప్రతి కౌంటర్... ఒక్కో మహిళ విజయాన్ని ప్రదర్శిస్తుంది. విజయవాడకు ఎంతో దూరం నుంచి ఆయా మహిళలు ప్రారంభించిన తమ స్ఫూర్తిదాయక ప్రయాణం ఇక్కడ కనిపిస్తుంది.

స్వయం సహాయక సంఘాల కుటుంబానికి చెందిన ఓ మహిళ... ఏడాదికి కనీసం రూ. 1 లక్ష స్థిరమైన ఆదాయాన్ని గడించగలిగితే ఆమెను 'లఖ్‌పతి దీదీ'గా పిలుస్తారు. 2029 నాటికి దేశంలో ఆరు కోట్ల మంది లఖ్‌పతి దీదీలను తయారు చేయాలనే గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పానికి ఈ మైలురాయే కేంద్ర బిందువు. దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద మహిళలకు అవసరమైన నైపుణ్యాలు, ఆర్థిక సహాయం, మార్కెట్ సదుపాయాలను అందిస్తూ వారు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం తోడ్పడుతోంది. ఈ లఖ్‌పతి దీదీలు సాధించిన విజయాల ప్రయాణాలు ఆ మైలురాయికి మించి వారు సాధించిన అద్భుతమైన ప్రగతిని స్పష్టం చేస్తున్నాయి.

చంద్రకళ కుటుంబానికి చెందిన చెక్క నకాశీ (వుడ్‌కార్వింగ్) వర్క్‌షాప్ 2002లో ప్రారంభమైంది. అప్పటివరకు వారిది కేవలం వ్యవసాయం చేసే కుటుంబం. అయిదేళ్ల తరువాత అంటే 2007లో... ఆమె భర్త కన్నుమూశారు. దాంతో ఆ వర్క్‌షాప్‌ను నడిపే బాధ్యత చంద్రకళపై పడింది. ప్రారంభంలో వచ్చిన ఆర్డర్లను సకాలంలో మూర్తి చేయడం, పని చేసే కళాకారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ఆమెకు పెద్ద సవాలుగా మారింది. ఆ హస్తకళ అంతా ఆమెకు తెలిసినదే అయినప్పటికీ... కస్టమర్లు, ఖాతాల నిర్వహణ, వ్యాపార నిర్ణయాలు మాత్రం ఆమెకు సరికొత్త అనుభవాలు.

లోటస్ స్వయం సహాయక సంఘం చంద్రకళకు కొండంత అండగా నిలిచింది. ఆమె కష్టాన్ని, బాధ్యతను అర్థం చేసుకుని తోడుగా నిలిచే మహిళలను ఆ సంఘం పరిచయం చేసింది. ఆ తర్వాత ఆమె వ్యాపారం సరిహద్దులు దాటి విస్తరించడం ప్రారంభమైంది. ప్రదర్శనలు, వాణిజ్య ఉత్సవాల్లో పాల్గొనడం కోసం ఆమె చెన్నై, ముంబై, విజయవాడ, విశాఖపట్నం, ఢిల్లీ వంటి నగరాలకూ వెళ్లారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు ఆయా నగరాలు సరికొత్త అనుభవాలను అందించాయి. ఒక కొత్త రైల్వే స్టేషన్... ఒక కొత్త స్టాల్... ఇలా ప్రతిచోటా ఆమె తయారు చేసిన చెక్క కళాఖండాన్ని చేతుల్లోకి తీసుకుని తిరగేస్తూ ధర అడిగే కస్టమర్లు ఆమెకు సరికొత్తగా అనిపించేవారు. ఒక ప్రదర్శనలో రోజు ముగియక ముందే తన వద్ద ఉన్న సరుకంతా అమ్ముడైపోయిన క్షణాలను ఆమె ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు. ప్రస్తుతం తన వ్యాపార సంస్థ వార్షిక టర్నోవర్ రూ. 1 కోటి దాటింది. ఈ సంస్థ ద్వారా నెలకు దాదాపు రూ. 10 లక్షల జీవనోపాధి చెల్లిస్తూ... 100 మందికి పైగా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. చంద్రకళ తన ఉత్పత్తులను 'లేపాక్షి ఎంపోరియం' షోరూంల ద్వారా దేశంలోని అనేక నగరాలకు సరఫరా చేస్తున్నారు. మంత్రులు, ప్రముఖులకు కానుకలుగా ఇవ్వడానికి ఆమె తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేస్తుండటం విశేషం.

చంద్రకళ తదుపరి లక్ష్యం కేవలం ఈ సంపాదన సంబంధిత అంకెలకు మాత్రమే పరిమితమైనది కాదు... అంతకు మించినది. చాలా ఉన్నతమైనది. 'నేను ఈ వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనీ, అలాగే 500 మంది గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాలనీ అనుకుంటున్నాను. ఈ విధంగా నా భర్త ఆశయాలను, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని నేను ఆశిస్తున్నాను' అని చంద్రకళ ధీమాగా చెబుతున్నారు.

నాలుగేళ్ల కిందట, ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా పూర్తి చేసిన సిద్ధి... ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సొంతంగా ఎత్నిక్ వేర్ (సాంప్రదాయ దుస్తుల) వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ వ్యాపారం కోసం ఆమె స్వయంగా నిధులు సమకూర్చుకున్నారు. అప్పటికే సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్న సిద్ధి, వినియోగదారులను చేరుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్‌ను ఒక చక్కని అవకాశంగా మలుచుకున్నారు. 'మహామాయ' స్వయం సహాయక సంఘం ఆమెకు ఎంతో అండగా నిలిచింది. ఆమెతో కలిసి పనిచేయగల మహిళలను అనుసంధానించడంతో పాటు, రుణాలు పొందే మార్గాలపై ఆమెకు మార్గనిర్దేశం చేసింది. ఈ బంధాన్ని పరస్పర సహకార బంధంగా సిద్ధి అభివర్ణిస్తారు. హస్తకళల నైపుణ్యాలు, మార్కెటింగ్‌పై జరిగే వర్క్‌షాప్‌ల సమాచారాన్నీ ఈ సంఘం ఆమెకు ఎప్పటికప్పుడు అందిస్తోంది. వీటిలో సిద్ధి తన బృందంతో కలిసి పాల్గొంటున్నారు.

ప్రస్తుతం ఆమె స్వయంగా శిక్షణనిచ్చిన మహిళలు సహా సుమారుగా ఏడు నుంచి పది మంది సిబ్బందితో సొంతంగా ఒక బోటిక్‌ను నడుపుతున్నారు. అవసరమైనప్పుడు ఆమె స్వయంగా బట్టల కటింగ్ చేస్తారు. వీరి బృందం టైలరింగ్, కుట్టుపని, ముడిసరుకు సేకరణ, ప్యాకింగ్, ప్రదర్శనల్లో సహాయం చేయడం వంటి పనులన్నీ నిర్వహిస్తుంది. సోషల్ మీడియాతో పాటు తన సొంత వెబ్‌సైట్ ద్వారా మార్కెటింగ్ బాధ్యతలనూ ఆమె స్వయంగా చూసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చే అంతర్జాతీయ ఆర్డర్లను ఇండియా పోస్ట్ ద్వారా సింగపూర్, యూఏఈ, యూఎస్ఏ వంటి మరెన్నో దేశాల కస్టమర్లకు పంపుతున్నారు. ప్రస్తుతం ఆమె వ్యాపార వార్షిక టర్నోవర్ రూ. 60 లక్షలుగా నమోదైంది.

ప్రారంభంలో, ఆమె చుట్టుపక్కల వారు ఈ వ్యాపార ఆలోచనకు పెద్దగా మద్దతునివ్వలేదు. ఆమె ఏదైనా సాధారణ ఉద్యోగంలో, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలని వారు కోరుకున్నారు. సిద్ధి మాత్రం ఆ నిరాశను వక్కనపెట్టి తన వ్యాపారంతోనే ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. 'నా బృందంలో మరింత మంది మహిళలు చేరేలా వారికి సహాయం చేయడమే నా కోరిక' అని ఆమె చెబుతున్నారు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో, గోవా వ్యాప్తంగా మరో 100 మంది మహిళలకు ఉపాధి కల్పించాలనీ, వారూ ఆర్థిక స్వాలంబన సాధించేలా తోడ్పడాలని ఆమె ఆశిస్తున్నారు.

కున్వారీ బర్వా, మహిళా వికాస్ మండల్ బాఘిమా పాల్కోట్ ఎఫ్‌పీవో, గుమ్లా, జార్ఖండ్: మహిళా రైతులతో కలిసి రాగుల వ్యాపార సంస్థను ఏర్పాటు చేయడం

కున్వారీ బర్వా ప్రయాణం ఆమె గ్రామంలోని ఒక స్వయం సహాయక బృందంతో మొదలైంది. అక్కడి మహిళలు ఒక్కొక్కరు రూ. 2 చొప్పున పొదుపు చేయడం ప్రారంభించారు. ఆమె ఇతర మహిళలనూ ఇందులో చేరమని ప్రోత్సహించి, పోగు చేసిన పొదుపు నుంచి రుణం తీసుకుని ఒక ఆవును కొనుగోలు చేసింది. ఆ తర్వాత, బ్యాంకు అనుసంధానిత రుణం ఆమెకు కూరగాయల సాగుకు కావలసిన పరికరాలను కొనుగోలు చేయడంలో సహాయపడింది. తాను పండించిన పంటను అమ్మడం ద్వారా తన కుటుంబాన్ని పోషించుకోవడానికి, పిల్లల చదువుల ఖర్చులను భరించడానికి ఆమెకు ఒక మార్గం దొరికింది.

మహిళా గ్రూపులన్నీ ఏకం కావడంతో వారి వ్యాపారం వేగంగా విస్తరించింది. 2022 లో 381 మంది సభ్యులతో వారు ఒక రైతు ఉత్పత్తిదారుల సంస్థను (ఎఫ్‌పీవో) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సంస్థలో సభ్యుల సంఖ్య 1,501 కి చేరిందని కున్వారీ తెలిపారు. ఈ ఉమ్మడి బృందం రైతులకు రాగుల సాగులో సహాయం చేయడంతో పాటు, వంటను సేకరించి భద్రపరుస్తుంది. రాగి లడ్డూలు, థెకువా, ఇతర రుచికరమైన స్నాక్స్ తయారు చేస్తుంది. గుమ్లా లాంటి చిన్న గ్రామీణ ప్రాంతం నుంచి ప్రారంభమైన వీరి ఉత్పత్తులు.. నేడు ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో జరిగే ప్రదర్శనలకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థ నెలవారీ ఉత్పత్తుల విక్రయాలు సుమారు రూ. 6 నుంచి 7 లక్షల వరకు చేరినట్లు ఆమె పేర్కొన్నారు.

ఈ సంస్థ ప్రస్తుతం 150 మందికి పైగా మహిళలకు నిరంతర ఉపాధి కల్పిస్తోంది. ఆర్డర్లు పెరిగినప్పుడు మరికొంత మంది మహిళలను పనిలోకి తీసుకుంటోంది. ఈ జాతీయ ప్రదర్శనలు గ్రామీణ మహిళలకు వివిధ ప్రాంతాలను సందర్శించే అవకాశాన్నీ కల్పించాయి. 'మా సంస్థలోని కొందరు మహిళలు అంతకుముందు కనీసం రైలు వట్టాలనైనా చూడలేదు. కానీ ఇప్పుడు మేము రైళ్లలోనే కాకుండా విమానాల్లోనూ ప్రయాణిస్తున్నాం' అని ఆమె సంతోషంగా చెప్పారు.

సింగంపల్లి పార్వతి (భర్త: రామినాయుడు), శ్రీ దుర్గా భవానీ ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూప్, అనకావల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్: ఒక చిన్న ప్రారంభం... ప్రస్తుతం సొంత వ్యాపార సామ్రాజ్యం"

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకావల్లి జిల్లాలోని నాతవరం గ్రామానికి చెందిన సింగంపల్లి పార్వతి కుటుంబం జీవనోపాధి కోసం ఒక చిన్న పొలం, పాలిచ్చే రెండు గేదెలను కలిగి ఉండేది. ఆమె భర్త రోజువారీ కూలీపైనే ఆ కుటుంబం ప్రధానంగా ఆధారపడేది. ఈ మార్గాల ద్వారా కొంత ఆదాయం వచ్చినప్పటికీ ఆ రాబడి... వారి కుటుంబ ఖర్చులకు, అనుకోని ఆర్థిక అవసరాలకు అది సరిపోయేది కాదు. కష్ట సమయాల్లో ఆ కుటుంబం అధిక వడ్డీలకు డబ్బు అప్పు తీసుకోవడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. ఇది వారి ఆర్థిక భారాన్ని మరింత పెంచింది. ఈ సవాళ్లు ఎదురైనప్పటికీ, పార్వతి సొంతంగా ఒక వ్యాపారాన్ని ప్రారంభించి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని బలంగా నిశ్చయించుకున్నారు. పెట్టుబడి కొరత ఆమె ఆశయాన్ని నిజం చేసుకోవడానికి ఒక పెద్ద అడ్డంకిగా మారింది.

2018లో పార్వతి 'శ్రీ దుర్గా భవానీ ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూప్'లో చేరడం ఆమె జీవితంలో అతిపెద్ద మలుపు. ఈ గ్రూపు ద్వారా ఆమె రూ. 20,000 రుణం పొందారు. ఈ డబ్బుతో ఆమె జీడిపప్పు పిక్కలను కొనుగోలు చేసి, విక్రయించే వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ మొదటి ప్రయత్నం ఆమెకు మార్కెట్‌ను అర్థం చేసుకోవడానికి, వ్యాపార అనుభవాన్ని పెంపొందించుకోవడానికి, ఒక వ్యాపారవేత్తగా మారే దిశగా తొలి అడుగులు వేయడానికి సహాయపడింది. ఈ వ్యాపారంలో ఉన్న అవకాశాలను చూసి ఉత్సాహం పొందిన ఆమె, తర్వాతి సంవత్సరంలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం మరో రూ. 50,000 రుణం తీసుకుని, రెండు కటింగ్ మిషన్లను కొనుగోలు చేశారు. జీడిపిక్కల నుంచి జీడిపప్పును వేరు చేసే ప్రాసెసింగ్ ప్రక్రియను ప్రారంభించి, ఆ పప్పును తునిలోని వ్యాపారులకు విక్రయించడం మొదలుపెట్టారు. కేవలం జీడిపిక్కల వ్యాపారం చేయడం కంటే, వాటిని ప్రాసెస్ చేసి విక్రయించడం ద్వారా ఆమె తన ఉత్పత్తులకు అదనపు విలువను చేకూర్చారు. ఇది ఆమె వ్యాపార వృద్ధిలో, ఆదాయం పెరగడంలోనూ కీలకంగా మారింది.

వ్యాపారం వృద్ధి చెందుతున్న కొద్దీ, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా జీడిపప్పు ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరాన్ని పార్వతి గుర్తించారు. ఆమె ప్రయాణంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపు అందించిన ఆర్థిక సహాయం కీలక పాత్ర పోషించింది. ఆ గ్రూపు ద్వారా పొందిన రూ. 2 లక్షల రుణంతో పాటు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద బ్యాంకు ద్వారా లభించిన రూ. 3 లక్షల ఆర్థిక సహాయం ఆమెకు ఎంతో తోడ్పడ్డాయి. ఈ నిధులతో ఆమె ఒక పెద్ద జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పెట్టుబడి ఆమె వ్యాపార కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఒక చిన్న స్థాయి నుంచి పెద్ద వ్యాపార సంస్థ యజమానిగా ఆమె ఎదగడానికి సహాయపడింది.

ప్రస్తుతం పార్వతి తమ కస్టమర్ల విభిన్న అవసరాలకు అనుగుణంగా 11 రకాల గ్రేడ్‌లలో జీడిపప్పును ప్రాసెస్ చేస్తున్నారు. ఆమె తన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. కొత్త మార్కెట్లను చేరుకోవడానికి, తన ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ఆమె వివిధ జాతీయ ప్రదర్శనల్లోనూ పాల్గొంటున్నారు. ప్రారంభంలో కేవలం రూ. 20,000 రుణంతో చిన్న స్థాయిలో మొదలైన ఆమె వ్యాపారం... నేడు సుమారు రూ. 50 లక్షల వార్షిక టర్నోవర్‌తో ఒక పెద్ద సంస్థగా ఎదగడం ఒక విశేషమైన విజయం.

సకాలంలో లభించే ఆర్థిక సహాయం, సంఘం తోడ్పాటు, వ్యాపార పట్టుదల ఉంటే గ్రామీణ మహిళలు ఎంతటి స్థిరమైన జీవనోపాధిని నిర్మించుకోగలరో చెప్పడానికి పార్వతి విజయ ప్రయాణం ఒక నిదర్శనం. కుటుంబ ఆదాయానికి అదనపు ఆసరా కోసం ఒక చిన్న ప్రయత్నంగా ప్రారంభమైన ఆమె ప్రయాణం... నేడు నిరంతరం వృద్ధి చెందుతున్న ఒక పెద్ద ప్రాసెసింగ్ పరిశ్రమగా రూపాంతరం చెందింది. ఒకప్పుడు పెట్టుబడి కోసం ఎన్నో ఇబ్బందులు పడిన ఈ వ్యాపారం... ఇప్పుడు ఆమె కుటుంబ ఆర్థిక శ్రేయస్సుకు అత్యంత కీలకమైన వనరుగా మారింది. గ్రామీణ మహిళల్లో దాగి ఉన్న వ్యాపార నైపుణ్యాలు సరికొత్త ఆర్థిక అవకాశాలను ఎలా సృష్టిస్తాయో, కుటుంబాల జీవనోపాధిని ఎలా బలోపేతం చేస్తాయో ఈ విజయం స్పష్టం చేస్తోంది.

ఈ విజయ ప్రయాణాలన్నింటి వెనక ఉన్న ఒకే విధమైన సూత్రం - ఒక అద్భుతమైన నైపుణ్యం, ఆ నైపుణ్యాన్ని నమ్మిన కొందరు మహిళల బృందం, ప్రతి ప్రదర్శన లేదా ప్రతి ఆర్డర్ ద్వారా విస్తరిస్తూ వచ్చిన మార్కెట్. జాతీయ సరస్ మేళాలో 'లఖ్‌పతి దీదీ పెవిలియన్'ను సందర్శించే వారు నేరుగా ఈ మహిళలను కలిసి వారి అనుభవాలను తెలుసుకోవచ్చు. కేవలం ఒక నైపుణ్యంతో, సంఘంలో ఒకరిగా ప్రయాణం ప్రారంభించి... నేడు ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని, విస్తృతమైన మార్కెట్ పరిధిని, స్థిరమైన ఆదాయాన్ని వారు ఎలా సాధించారో స్వయంగా వారి మాటల్లో తెలుసుకోవచ్చు.

బుగులోని జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

నవంబర్ 23 నుంచి 27 వరకు జాతర.. ఏర్పాట్లపై ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ సమీక్ష

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే నెల 23 నుంచి 27 వరకు జాతర అంగరంగ వైభవంగా జరగనుందని, రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లన్నీ సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాతరలో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జాతర ప్రారంభమయ్యే సమయానికి పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

గత జాతర సందర్భంగా రూ.8 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, అటవీ శాఖ చట్టాల కారణంగా కొన్ని పనులు పూర్తి కాలేదని పేర్కొన్నారు.

త్వరలోనే అటవీ శాఖతో సమన్వయం చేసుకుని జాతరను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో బుగులోని జాతర చైర్మన్ గంగుల రమణారెడ్డి, ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, కొడవటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, తిరుమలగిరి గ్రామ సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, మాజీ జాతర చైర్మన్లు కట్ల చిన్ని, రొంటాల వెంకటస్వామి, ఉపసర్పంచ్ ఆకుతోట తిరుపతి, జాతర పురోహితులు కూర్మాచలం వెంకటేశ్వర్లు, తిరుమలగిరి కాంగ్రెస్ నాయకులు మంతెపూరి తిరుపతి, రొంటాల రఘుపతి, మచ్చిక రాజ్‌కుమార్, మామిడాల సందీప్, లాంసాని దేవేందర్, రవీందర్ రెడ్డి, కిరణ్, అశోక్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

-ప్రభుత్వ విప్ విజయరమణరావు

కరీంనగర్, అక్టోబర్ 27:యువతకు మార్కెట్



అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల ఆధునికీకరణ పనులను, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన పలువురు యువత ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. టాస్క్ కేంద్రం ద్వారా ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగావకాశాలు, సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు.

నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని విజయరమణరావు తెలిపారు. పాఠశాలల పునరుద్ధరణ, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పెద్దపల్లి మండలంలోనే సుమారు రూ.14 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పెద్దపల్లి మండలంలో ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు పేర్కొన్నారు. గతంలో జిల్లా విద్యా ఫలితాల్లో పెద్దపల్లి 32వ స్థానంలో ఉండగా, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన చర్యల ఫలితంగా ప్రస్తుతం 8వ స్థానానికి చేరుకుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యాబోధన అందిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.800 కోట్ల వ్యయంతో అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని విజయరమణరావు పేర్కొన్నారు. హరే రామ ట్రస్ట్ సహకారంతో అమలవుతున్న ఈ పథకం పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు దోహదపడుతోందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ముఖ్యమని పేర్కొంటూ, విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యంతో కష్టపడి చదవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. జిల్లాలో టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నర కాలంలో సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వివరించారు.

వరద ఉధృతికి దెబ్బతిన్న రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే సామేల్

బావి చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ఆదేశం



ఖమ్మం, అక్టోబర్ 27:గతంలో కురిసిన వర్షాలకు మండలంలోని పాటిమట్ల గ్రామం బతుకమ్మ ఘాట్ వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డును తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం నాయంగా పరిశీలించారు. రోడ్డుపై ప్రయాణించే వారు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడిపోయే ప్రమాదం ఉందని గ్రామ సర్పంచ్ బండ రమ విజయ్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఎమ్మెల్యే, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే బావి పక్కన రక్షణ గోడలు ఏర్పాటు చేసి, ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వేణు తదితరులు పాల్గొన్నారు. సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బండ రమ విజయ్‌రెడ్డి, ఉపసర్పంచ్ దండె బోయిన సత్తయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ బాలరాజు గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కురిమేటి విక్రమ్, నాయకులు బొడ్డపల్లి కళ్యాణ్, లెంకల వేణు తదితరులు పాల్గొన్నారు.

సారపాకలో పోలీసుల తనిఖీలు

డ్రువపత్రాలు లేని 43 వాహనాల గుర్తింపు
గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
నిబంధనలు పాటించాలని డీఎస్పీ సూచన

ఖమ్మం, అక్టోబర్ 27:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండలం సారపాక సుందరయ్య నగర్‌లో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టి, సరైన డ్రువపత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, ఆటోలను గుర్తించారు.శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు.



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ, డాగ్ స్క్వాడ్ బృందాలకు చెందిన సుమారు 50 మంది పాల్గొన్నారు.

రక్షణ దళాల కోసం రూ. 2.12 లక్షల కోట్ల విలువైన మూలధన కొనుగోలు ప్రతిపాదనలకు డీఏసీ ఆమోదం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన 2026 అక్టోబర్ 26న జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశంలో రక్షణ దళాల కోసం వివిధ ఆయుధాలు, సైనిక పరికరాల (మూలధన సేకరణ) కొనుగోలు ప్రతిపాదనలకు పాలనాపరమైన ఆమోదం (ఏఓఎన్) లభించింది. ఈ కొనుగోళ్లకు సుమారు రూ.2,12,000 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందులో భాగంగా భారత సైన్యం కోసం అధిక చలనశీలత కలిగిన వాహనాలు (హెచ్‌ఎంవీలు), స్వయంచాలకంగా కదులుతూ కాల్పులు జరిపే ట్రాక్డ్ గన్ వ్యవస్థ, గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్), తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు (ఎల్ఎంఆర్‌హెచ్), అత్యంత స్వల్పశ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థ (వీషోరాడ్స్), వేదిక ఆధారిత మానవరహిత వైమానిక వ్యవస్థల వ్యతిరేక వ్యవస్థ (సీ-యూఏఎస్), దీర్ఘశ్రేణి మానవరహిత వైమానిక వ్యవస్థ, నిఘా డ్రోన్లు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థ, దీర్ఘశ్రేణి కామికాజే డ్రోన్ వ్యవస్థల కొనుగోలుకు ఆమోదం లభించింది.

అధిక చలనశీలత కలిగిన వాహనాలు క్లిష్టమైన భూభాగాల్లో ఆర్మీ కార్యకలాపాల సామర్థ్యాన్ని, రవాణా సహకారాన్ని, కదలికలను మెరుగుపరుస్తాయి. స్వయంచాలక ట్రాక్డ్ గన్ వ్యవస్థ యాంత్రిక సైనిక దళాలకు తగిన చలనశీలతతో పాటు కాల్పుల సామర్థ్యాన్ని అందిస్తుంది. గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్ (జీఎస్ఆర్ఎస్) సైనిక బలగాల పరిసర పరిస్థితులపై తక్షణ సమాచారాన్ని అందిస్తూ వాటి సామర్థ్యాన్ని పెంచుతుంది. తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లను భారత సైన్యం, భారత వైమానిక దళం రెండూ ఉపయోగించనున్నాయి. నిఘా, పరిశీలన, యుద్ధ కార్యకలాపాలు, సైనికుల శోధన, రక్షణ చర్యలు, మానవతా సహాయం, విపత్తుల సమయంలో సహాయక చర్యలకు ఇవి ఉపయోగపడతాయి. అత్యంత స్వల్పశ్రేణి వైమానిక రక్షణ వ్యవస్థ (వీషోరాడ్స్) కొత్త తరానికి చెందిన చిన్న పరిమాణంలోని వైమానిక ముప్పులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుంది. ఇక సీ-యూఏఎస్ వ్యవస్థ ఆధునిక యుద్ధభూమిలో ట్యాంకుల మనుగడ సామర్థ్యాన్ని పెంచుతుంది. నిఘా, డ్రోన్ వ్యవస్థలు భారత సైన్యం పరిశీలనా సామర్థ్యాలను, లక్ష్యాలను గుర్తించి దాడి చేసే సామర్థ్యాలను మరింత మెరుగుపరుస్తాయి.

భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ వ్యవస్థ (ఏఓడీఎస్)తో పాటు ఇతర ప్రధాన నౌకాదళ వేదికల కొనుగోలుకు ఆమోదం లభించింది. ఏఓడీఎస్ వ్యవస్థ శత్రువుల ఆధునిక నౌకా విధ్వంసక క్షిపణుల నుంచి రక్షణ కల్పించడంలో క్షిపణి నిరోధక వ్యవస్థల సామర్థ్యంపై విశ్వసనీయతను పెంచుతుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించే ప్రధాన నౌకాదళ వేదికలు ఆధునిక యుద్ధ సామర్థ్యాలను కలిగి ఉండటంతో పాటు నౌకాదళ పోరాట సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి.

భారత వైమానిక దళం కోసం గగనతల రక్షణ, యుద్ధ సామర్థ్యాలను పెంచేందుకు హెలికాప్టర్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ వ్యవస్థ కొనుగోలుకు ఆమోదం లభించింది.

ప్రత్యేక ప్రయోజన హెలికాప్టర్ల కొనుగోలు ద్వారా వైమానిక దళానికి అవసరమైన కీలక వైమానిక రవాణా అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది. ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ వ్యవస్థ ముందస్తు ప్రాంతాల్లో స్థానిక వాతావరణ పరిస్థితులను అధిక స్పష్టతతో పర్యవేక్షించేందుకు ఉపయోగపడుతుంది.

రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదించిన మొత్తం ప్రతిపాదనల్లో సుమారు 82 శాతం కొనుగోళ్లను భారతీయ పరిశ్రమల నుంచే చేపట్టనున్నారు.

ప్రత్యేక ప్రచారం-6: : బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల కీలక పురోగతి

పరిశుభ్రతను సంస్థాగత విధానంగా మార్చడం, ఈ-వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడమే లక్ష్యంగా బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈలు) ప్రత్యేక ప్రచారం-6లో గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా కార్యాలయాల్లో విలువైన స్థలాన్ని ఖాళీ చేయడంతో పాటు, వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. అంతర్గత రికార్డుల నిర్వహణను క్రమబద్ధీకరిస్తూ పరిశుభ్రమైన, ఉత్పాదకతతో కూడిన పని వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారు.

అక్టోబర్ 31 వరకు ఈ కార్యక్రమం అమలు కానుంది. తొలుత 1,565 ప్రదేశాలను శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. లక్ష్యాన్ని అధిగమించి 1,696 ప్రదేశాలను సీపీఎస్ఈలు శుభ్రం చేశాయి. మొత్తం 130.16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని పరిశుభ్రం చేశాయి. ఇది నిర్దేశించిన 101.80 లక్షల చదరపు అడుగుల లక్ష్యం కంటే ఎక్కువ.

కార్యాలయాల పరిసరాలను మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను కూడా ఈ కార్యక్రమం అందించింది. అంచనా వేసిన 10,909 మెట్రిక్ టన్నుల లక్ష్యం కంటే అధికంగా మొత్తం 16,158 మెట్రిక్ టన్నుల తుక్కు, పనికిరాని వస్తువులను తొలగించి విక్రయించారు. ఈ విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 53,94,62,602.45 ఆదాయం సమకూరింది. అంటే సుమారు రూ.53.94 కోట్ల ఆదాయం లభించింది.

రికార్డుల నిర్వహణ, డిజిటలైజేషన్ చర్యల ద్వారా పరిపాలనా సామర్థ్యం గణనీయంగా మెరుగుపడింది. మొత్తం 59,593 ఫైళ్లను పరిశీలించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. అధికారులు 78,635 భౌతిక ఫైళ్లు, ఈ-ఫైళ్లను సమీక్షించారు. వీటిలో 70,093 ఫైళ్లను తొలగించి, వాటి ప్రక్రియను ముగించారు. ఇది పరిపాలన, కార్యాలయ విధానాలను మరింత క్రమబద్ధీకరించడాన్ని ప్రతిబింబిస్తోంది.

పరిశుభ్రతను సంస్థాగత విధానంగా మార్చడం, స్థిరమైన పరిపాలనా విధానాలను అమలు చేయడంపై తమ నిబద్ధతను చాటుతూ.. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈలు) వినూత్న స్వచ్ఛత కార్యక్రమాలు, సమర్థవంతమైన స్థల నిర్వహణ విధానాలతో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అమలు చేసిన ముఖ్యమైన ఉత్తమ విధానాల్లో కొన్ని....

పునర్వినియోగ వ్యర్థాలతో ఈ-వ్యర్థాల సేకరణ బిన్ ఏర్పాటు: ఎస్ఈసీఎల్ ప్రధాన కార్యాలయంలో పునర్వినియోగ తుక్కు పదార్థాలతో ఈ-వ్యర్థాల సేకరణ బిన్‌ను రూపొందించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను క్రమపద్ధతిలో సేకరించి, వేరు చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. "ఈ-వ్యర్థాలను సమర్థంగా సేకరించడం, వేరు చేయడం, సరైన విధంగా తొలగించడం" కార్యక్రమ లక్ష్యానికి అనుగుణంగా ఇది ఉపయోగపడుతుంది.

నీఐఎల్ హెచ్‌క్యూ క్యాంటీన్ ఆధునికీకరణ: దాదాపు పదేళ్ల తర్వాత సమగ్రంగా పునరుద్ధరించిన కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ప్రధాన కార్యాలయ క్యాంటీన్‌కు 'సిలాంట్రో'గా పేరు మార్చి అక్టోబర్ 5న ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉద్యోగులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన, అనుకూలమైన భోజన వాతావరణాన్ని కల్పించేందుకు క్యాంటీన్ మౌలిక సదుపాయాలను, పరిసరాలను ఆధునికీకరించారు.

గిరిజన బాలికలకు డబ్ల్యూసీఎల్ విద్యా సహాయం: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా పరాసియాలో ఉన్న మాతా సబ్రీ బాలికల నివాస విద్యా ప్రాంగణంలో 160 మందికి పైగా బాలికలకు విద్యా సహాయంతో పాటు ప్రాథమిక సదుపాయాలను వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్) అందించింది. వీరిలో ఎక్కువ మంది గిరిజన, బొగ్గు గనుల ప్రాంతాలకు చెందిన బాలికలే ఉండగా.. ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారికి ఈ సహాయం అందించారు.

డబ్ల్యూసీఎల్ ద్వారా పిల్లల కోసం 'వేస్ట్ టు వండర్' శిక్షణా కార్యక్రమాలు: వ్యర్థాలను సృజనాత్మకంగా పునర్వినియోగించడం ద్వారా ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసేలా పిల్లలను ప్రోత్సహించేందుకు డబ్ల్యూసీఎల్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. వ్యర్థాల నుంచి విలువైన వస్తువులను రూపొందించడం ద్వారా చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించడం ఈ కార్యక్రమాల లక్ష్యం.

కార్యాలయంలో రుతుస్రావ పరిశుభ్రతను ప్రోత్సహించడం: మహిళా ఉద్యోగులు, సందర్శకులకు రుతుస్రావ పరిశుభ్రత ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సమ్మిళిత, మహిళలకు అనుకూలమైన కార్యాలయ వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారు.

భారత ఉక్కు మనిషికి నివాళి: అక్టోబర్ 27న ప్రతిష్ఠాత్మక సర్దార్ పటేల్ స్మారకోపన్యాసం ఇవ్వనున్న వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:భారత తొలి ఉప ప్రధాని, సమాచార, ప్రసార శాఖ మంత్రి, దేశ సమగ్రత రూపశిల్పి, 'ఉక్కు మనిషి'గా పిలుచుకునే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్మారకార్థం ఆకాశవాణి 1955 నుంచి ప్రతి ఏటా ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆయన అందించిన చిరస్మరణీయమైన సేవలను, వారసత్వాన్ని గుర్తుచేసుకోవడమే ఈ ప్రసంగాల ప్రధానోద్దేశం.

న్యూఢిల్లీలోని సందద్ మార్గ్‌లో ఉన్న ఆకాశవాణి రంగ భవన్ ఆడిటోరియంలో 2026 అక్టోబర్ 27 మధ్యాహ్నం 3 గంటలకు ఈ ప్రతిష్ఠాత్మక ఉపన్యాసం 67వ సంచికను నిర్వహిస్తారు. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఉపన్యాసం ఇస్తారు. సర్దార్ పటేల్ జయంతి నాడు (అక్టోబర్ 31) రాత్రి 9:30 గం.లకు దేశవ్యాప్తంగా ఆకాశవాణి నెట్‌వర్కులో రికార్డు చేసిన ఈ ప్రసంగం ప్రసారమవుతుంది.

ఈ ఉపన్యాసాల పరంపరలో తొలి ఉపన్యాసాన్ని భారతదేశ మొదటి గవర్నర్ జనరల్ భారతరత్న శ్రీ సి. రాజగోపాలాచారి ఇచ్చారు. అప్పటి నుంచి ఎంతో మంది ప్రముఖ నాయకులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు ఈ వేదికపై ప్రసంగించారు. వారిలో డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్, శ్రీ మొరార్జీ దేశాయ్, డాక్టర్ కరణ్ సింగ్, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్, జస్టిస్ (శ్రీమతి) లీలా సేథ్, శ్రీ రామ్‌నాథ్ కోవింద్, శ్రీ అరుణ్ జైట్లీ, శ్రీ అజిత్ దోవల్, డాక్టర్ ఎస్ జైశంకర్, జనరల్ బిపిన్ రావత్, డాక్టర్ ఎస్ సోమనాథ్ ఉన్నారు. గతేడాది నిర్వహించిన 66వ స్మారకోపన్యాసంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రసంగించారు.

వివిధ అంశాలపై ఆలోచనలకు, అభిప్రాయాలకు, దృష్టి కోణాలకు వేదికగా ఈ వార్షిక కార్యక్రమం నిలుస్తోంది. మన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధికి సంబంధించిన అనేక విషయాలను మరింత అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది. భారతదేశం గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఈ ఉపన్యాసాలు విజ్ఞాన భాండాగారాలుగా మారాయి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మేధోపరమైన తోడ్పాటును అందించి ఈ ప్రసంగాల పరంపరను గొప్ప సంప్రదాయంగా తీర్చిదిద్దారు.

ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే. అయితే ఆడిటోరియంలో సీట్లు అందుబాటులో ఉండటం ఆధారంగా ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారు.

ప్రముఖ నాయకులు, విశిష్ట వ్యక్తులు వెలువరించిన ప్రతిష్టాత్మక సర్దార్ పటేల్ స్మారక ఉపన్యాసాల గత సంచికలను ప్రసార భారతి అధికారిక యూట్యూబ్ ఆర్కైవ్‌లో వీక్షించవచ్చు.

పైడితల్లమ్మను దర్శించుకున్న మంత్రులు



విజయనగరం, అక్టోబర్ 27: విజయనగరం గ్రామదేవత, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడి తల్లమ్మను జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే హోంమంత్రి వర్గాలపూడి అనిత కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి కొండపల్లి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలందరికీ సిరిమానోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో కూడా సిరిమానోత్సవం ఘనంగా జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తుఫాన్ కారణంగా సిరిమానును ముందుగానే ప్రారంభించి భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తుల దర్శన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ పైడితల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

నల్గొండ, అక్టోబర్ 27: దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మంగళవారం నల్గొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని ఎస్పీ శరత్ చంద్ర పవార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది, తెలంగాణలో నలుగురు పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాలు స్ఫూర్తిదాయకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అమరవీరులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

'పాఠశాల నుంచి ఉపాధి దిశగా సులువైన పరివర్తన' అంశంపై న్యూఢిల్లీలో సీబీఎస్ఈ నాలుగో జాతీయ సదస్సు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు (సీబీఎస్ఈ), ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని నహోదయ పాఠశాల సముదాయాల సహకారంతో 'పాఠశాల విద్య నుంచి ఉపాధి రంగంలోకి సన్నద్ధం చేయడం' అంశంపై నాలుగో జాతీయ సదస్సును 2026 అక్టోబర్ 26, 27 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం (డీఓఎస్ఈఎల్) కార్యదర్శి టీకే అనిల్ కుమార్, సీబీఎస్ఈ ఛైర్మన్ డాక్టర్ మండీప్ భండారీతో పాటు కేంద్ర మంత్రిత్వ శాఖ, సీబీఎస్ఈకి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సదస్సులో అనిల్ కుమార్ ప్రసంగిస్తూ నాలుగు కీలక ప్రాధాన్య అంశాలను వివరించారు. అవి సాంకేతికత, డిజిటల్ భద్రత, నైపుణ్యాలు... రూపకల్పన, సృజనాత్మకత, ఆవిష్కరణలు... జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా వివిధ విద్యా వ్యవస్థల్లో నైపుణ్యాలకు గుర్తింపు.. సమాన అవకాశాలతో కూడిన వ?త్తి మార్గదర్శకత్వం. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి రంగాల్లోకి విద్యార్థులు సులభంగా మారేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జీవితాంతం అభివృద్ధి సాధించేందుకు, సమాజానికి సేవ చేసేందుకు, గౌరవమైన జీవితం గడిపేందుకు విద్యార్థులు సరైన నిర్ణయాలు తీసుకునేలా వారిని సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ద్వారా సాధారణ పాఠశాల విద్యలో నైపుణ్య విద్యను మరింత సమర్థంగా అనుసంధానించడం, విద్యార్థులు పాఠశాలల నుంచి ఉపాధి రంగంలోకి సులభంగా అడుగుపెట్టేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అభివృద్ధి చెందుతున్న శ్రామిక శక్తి అవసరాలు, విద్యార్థులను భవిష్యత్తు వృత్తులకు సిద్ధం చేసేందుకు అనుసరించాల్సిన వినూత్న విధానాలపై చర్చించేందుకు పాఠశాలల నాయకులు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, విధాన రూపకర్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. పరస్పరం పరిచయాలు పెంచుకోవడం, మార్గదర్శకత్వం, సహకారం కోసం భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం వంటి అవకాశాలను కూడా ఈ సదస్సు కల్పిస్తోంది.

జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) 2020లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వివిధ విద్యా విభాగాల మధ్య అడ్డంకులను తొలగించడం, మారుతున్న ఉపాధి రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ప్రాధాన్యమని ఈ సదస్సు స్పష్టం చేస్తోంది.

చర్చావేదికలు, నిపుణుల ప్రసంగాల ద్వారా బోధనలో వినూత్న పద్ధతులు, అభివృద్ధి చెందుతున్న మూల్యాంకన విధానాలు, విద్యలో డిజిటల్ సాంకేతికత వినియోగం, నైపుణ్య విద్యను బలోపేతం చేసే సమర్థవంతమైన విధానాలను పరిశీలించేందుకు ఈ సదస్సు పాల్గొనేవారికి అవకాశం కల్పిస్తోంది.

సదస్సులో భాగంగా సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల ఉపాధ్యాయులు నైపుణ్య విద్యలో సాధించిన విజయాలు, అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించే కేస్ స్టడీ పత్రాలు, పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. పాఠశాల విద్యలో వస్తున్న కొత్త ధోరణులు, మార్పులకు దారితీసే వినూత్న పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, బోధన-అభ్యసన ప్రక్రియలను మెరుగుపరిచేందుకు ఆచరణాత్మక వ్యూహాలను కూడా ఈ సదస్సు ద్వారా పాల్గొనేవారు తెలుసుకోనున్నారు.

ఎగుమతి ప్రోత్సాహక మిషన్ ద్వారా రిలీఫ్ కార్యక్రమాన్ని మార్చి 31, 2027 వరకు పొడిగించిన వాణిజ్య శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 27:ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) ద్వారా రిలీఫ్ (ఎగుమతులను సులభతరం చేసేందుకు చేపట్టిన సుస్థిర, రవాణా చర్యలు) పథకంలోని కాంపోనెంట్ ఎఎ గడువును మార్చి 31, 2027 వరకు వాణిజ్య శాఖ పొడిగించింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, గల్ఫ్, పరిసర ప్రాంతాల్లో సముద్ర రవాణాపై ప్రభావం దృష్ట్యా సెప్టెంబర్ 30, 2026 నాటి నోటిఫికేషన్ నెం. 37/2026-27 ద్వారా ఈ పొడిగింపును ప్రకటించింది.

నిర్దిష్ట ప్రాంతాలకు భవిష్యత్తులో జరిగే ఎగుమతులకు సంబంధించి 95 శాతం రిస్క్ కవరేజ్‌ను అందించటం ద్వారా ఎగుమతిదారులు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీజీసీ) బీమాను పొందేలా ప్రోత్సహించటాన్ని ఇది లక్ష్యంగా పెట్టుకుంది. మార్చి 16, 2026, ఆ తర్వాత పొందిన స్టాండ్‌అలోన్ పాలసీలు, హోల్ టర్నోవర్ పాలసీలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ఈ విభాగం ద్వారా అర్హులైన ఎగుమతిదారులు చెల్లించవలసిన ప్రీమియం, నిర్ణీత కాలంలో అంతకుముందున్న స్థాయిలను మించి పెరగకుండా కాపాడుతుంది. ఇంధన రవాణా మినహా, పూర్తి కంటైనర్ లోడ్ (ఎఫ్‌సీఎల్), పాక్షిక కంటైనర్ లోడ్ (ఎల్‌సీఎల్), రిఫ్రిజిరేటెడ్ (రీఫర్) కంటైనర్లు బీమా కార్గో వర్గాల్లో ఉన్నాయి.

రిలీఫ్ పథకం ద్వారా కవరేజ్ కోరుకునే ఎగుమతిదారులు lllll.వఞణఞశ్రీబిట.తిని. లోని ఈసీజీసీ కస్టమర్ పోర్టల్ ద్వారా క్లెమ్స్, సపోర్టింగ్ డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను జనరేట్ చేయటం, ఎగుమతిదారుల రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయటం, ఈ పథకం ద్వారా క్లెమ్స్ సమర్పించటంపై మార్గదర్శకత్వం కోసం ఈసీజీసీ అధికారిక యూట్యూబ్ ఛానెల్ ఏవఞణఞశ్రీబిట7016లో ప్రత్యేక వీడియో ట్యుటోరియల్స్ అందుబాటులో ఉన్నాయి.మార్చి 19, 2026న ప్రారంభించిన రిలీఫ్- గల్ఫ్, పశ్చిమాసియా సముద్ర కారిడార్‌లో ఏర్పడిన అంతరాయాల కారణంగా నరకు రవాణా వ్యయం విపరీతంగా పెరగటం, అధిక బీమా ప్రీమియంలు, యుద్ధ సంబంధిత ఎగుమతి నష్టాలను ఎదుర్కొంటున్న భారత ఎగుమతిదారులకు మద్దతిచ్చేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం.కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ, సముద్ర రవాణా అనిశ్చితుల మధ్య ఎగుమతుల స్థిరత్వాన్ని బలోపేతం చేసేందుకు, వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చూసేందుకు, భారత ఎగుమతిదారులకు మద్దతిచ్చేందుకు ప్రభుత్వానికున్న నిబద్ధతను రిలీఫ్ పొడిగింపు స్పష్టం చేస్తుంది.

బంగాళాఖాతంలో ముంచుకొస్తున్న తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనే సన్నద్ధతపై సమీక్షించేందుకు క్యాబినెట్ కార్యదర్శి అధ్యక్షతన జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్‌సీఎంసీ) సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 27:బంగాళాఖాతంలో ముంచుకొస్తున్న తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనే సన్నద్ధతపై సమీక్షించేందుకు క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ టీవీ సోమనాథన్ అధ్యక్షతన జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్‌సీఎంసీ) సమావేశాన్ని నిర్వహించారు.

భారత వాతావరణ విభాగం (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ ఈ కమిటీకి వివరాలను వెల్లడించారు. తూర్పు మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం దాదాపు పశ్చిమ దిశగా కదిలి 'ఆర్నబ్' తుపానుగా బలపడిందని తెలిపారు. ఇది ఈరోజు ఉదయం 5:30 గంటల సమయానికి తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది శ్రీ విజయ పురం (అండమాన్ దీవులు)కు వాయవ్యంగా దాదాపు 590 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి తూర్పు-ఆగ్నేయంగా 650 కిలోమీటర్లు, కాకినాడకు తూర్పు-ఆగ్నేయంగా 730 కిలోమీటర్లు, మచిలీపట్నానికి తూర్పుగా 830 కిలోమీటర్లు, బాపట్లకు తూర్పుగా 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వివరించారు.

ఇది అక్టోబర్ 27 నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా, ఆ తర్వాత వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని అంచనా వేశారు. 2026 అక్టోబర్ 28 ఉదయానికి ఇది బాపట్ల - విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను అత్యంత తీవ్ర తుపానుగా దాటే సూచనలు ఉన్నాయి. ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, గరిష్టంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని చేరుకోవచ్చని తెలిపారు. అనంతరం ఇది తెలంగాణ, దక్షిణ ఒడిశా, దక్షిణ-మధ్య ఛత్తీస్‌గఢ్‌తో పాటు తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

రాష్ట్రాలు/స్థానిక పరిపాలనా యంత్రాంగాలు చేపడుతున్న ముందస్తు చర్యల గురించి కమిటీకి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంత ముఖ్యకార్యదర్శులు/ఉన్నతాధికారులు వివరించారు. తగినన్ని పునరావాస కేంద్రాలను, సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించే ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని కూడా చెప్పారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు సమాచారమిచ్చారు.

అక్టోబర్ 26 నుంచి 29 వరకు నైరుతి, దానికి ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతంలోకి, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, యానాం (పుదుచ్చేరి) తీర ప్రాంతాల్లో సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు తిరిగి ఒడ్డుకు చేరుకున్నారు. ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్ఓపీ) సిద్ధం చేశామని, అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశామని, తుపాను తీవ్రత వల్ల ఎదురయ్యే నష్టాన్ని వీలైనంత తగ్గించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రిత్వశాఖలు/విభాగాలు తెలిపాయి.

ఇప్పటికే అవసరమైన బృందాలను మోహరించామని, మరిన్ని బృందాలను సిద్ధంగా ఉంచామని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) తెల

చర్చలను స్పష్టమైన, ఆచరణాత్మక ఫలితాలుగా మార్చటంలోనే బ్రిక్స్ విజయం దాగి ఉంది: లోక్‌సభ స్పీకర్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:భారత పార్లమెంటు ప్రాంగణంలోని చరిత్రాత్మక సంవిధాన్ సదన్‌లో నేడు జరిగిన 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్-2026ను లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్రారంభించారు. ప్రజలే కేంద్రంగా అభివృద్ధి, ప్రపంచ శాంతి, సుస్థిరత, అంతర్జాతీయ సహకారం పట్ల ఉమ్మడి సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల పార్లమెంట్లకు పిలుపునిచ్చారు. మార్పును తీసుకురావటంలో పార్లమెంటరీ భాగస్వామ్యానికున్న సామర్థ్యాన్ని స్పష్టం చేశారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు, పరస్పర అవగాహనను పెంపొందించేందుకు, పౌరుల జీవితాల్లో అర్థవంతమైన, సానుకూల మార్పును తీసుకువచ్చేందుకు దేశాల ఉమ్మడి విజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

భారత్‌కు విచ్చేసిన బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలకు శ్రీ ఓం బిర్లా స్వాగతం పలికారు. ఈ దేశాల రాకతో పరస్పర చర్చలు, పార్లమెంటరీ సహకారం, పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువల పట్ల భాగస్వామ్య దేశాల నిబద్ధత తెలుస్తుందని అన్నారు. భౌగోళిక, సాంస్కృతిక, భాషా, సామాజిక వైవిధ్యాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య ఆదర్శాలపై విశ్వాసం, మానవాళి పట్ల ఉమ్మడి బాధ్యత అన్ని దేశాలను ఏకం చేస్తున్నాయని అన్నారు. వైవిధ్యాన్ని శక్తిగా, ఉమ్మడి లక్ష్యంగా, సమష్టి ప్రగతికి మూలంగా మార్చటంలోనే బ్రిక్స్ అసలైన బలం దాగి ఉందన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల ప్రభుత్వాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఉమ్మడి ప్రకటనను ఏకగ్రీవంగా ఆమోదించటం కీలకమైన ఘట్టంగా శ్రీ ఓం బిర్లా అభివర్ణించారు. సభ్య దేశాలకు అభినందనలు తెలిపారు. ఈ ఉమ్మడి ప్రకటనలోని అంశాలను స్పష్టమైన, శాశ్వత ఫలితాలుగా మార్చటమే ప్రస్తుత సవాలని స్పష్టం చేశారు. శాసన అధికారాలు, బడ్జెట్ ప్రక్రియలు, చర్చలు, పర్యవేక్షణ ద్వారా పార్లమెంట్లు ఈ అంశాలను ఆచరణాత్మక చర్యలుగా మలచటంలో, పౌరులకు స్పష్టమైన ప్రయోజనాలను అందించటంలో కీలక పాత్ర పోషించగలవని స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న సందర్భంగా.. ప్రాంతీయ సంఘర్షణలు, యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం, వాతావరణ మార్పుల వల్ల ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని శ్రీ ఓం బిర్లా అన్నారు. ఈ సవాళ్ల పర్యవసానాలు కేవలం ఏ ఒక్క దేశానికో పరిమితం కాకుండా ప్రపంచ దేశాలకు విస్తరిస్తున్నాయని, కాబట్టి సమష్టి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. సవాలుతో కూడిన ప్రపంచ పరిస్థితుల్లో చర్చలు, దౌత్యనీతి, పరస్పర సహకారాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపాలైన పార్లమెంట్లు.. అవగాహనకు వారధులుగా నిలుస్తూ, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించేందుకు, అంతర్జాతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు, ప్రపంచ సవాళ్లకు శాంతియుత, నిర్మాణాత్మక పరిష్కారాలను అందించేందుకు తోడ్పడతాయని తెలిపారు. పార్లమెంటరీ దౌత్యం ద్వారా ప్రజాప్రతినిధుల దృక్పథాలను పరస్పరం మార్చుకోవచ్చని, అనుభవాలను పంచుకుంటూ సమాన ప్రయోజనాలను గుర్తించి, అర్థవంతమైన అంతర్జాతీయ సహకారానికి సూతన మార్గాలను సుగమం చేయవచ్చని చెప్పారు.

గ్లోబల్ సౌత్ స్వరాన్ని మరింత బలపరచంలో, వారి ఆకాంక్షలను ప్రపంచ వేదికపై ముందుకు తీసుకెళ్లటంలో బ్రిక్స్ కూటమికి కీలక బాధ్యత ఉందని శ్రీ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. ఈ ఆకాంక్షలు కేవలం చర్చలు, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాలను మెరుగుపరిచే విధానాలు, ఆచరణాత్మక సహకారం, ఉమ్మడి కార్యక్రమాల ద్వారా కార్యరూపం దాల్చాలని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు, ప్రాధాన్యతలకు అంతర్జాతీయ నిర్ణయాల్లో తగిన ప్రాతినిధ్యం లభించేలా చూడటంలోనూ, అందరి ఉమ్మడి లక్ష్యాలను క్రియాశీలక కార్యక్రమాలుగా మార్చటంలోనూ ఈ కూటమి అసలైన బలం ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

'ప్రజలే కేంద్రంగా అభివృద్ధి కోసం పార్లమెంట్ల బలోపేతం' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్-2026 ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ప్రాధాన్యతను సంతరించుకుందని శ్రీ ఓం బిర్లా చెప్పారు. రెండు రోజుల పాటు సాగే ఈ ఫోరమ్.. పటిష్టత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత వంటి నాలుగు పరస్పర అనుసంధాన అంశాలపై సమగ్ర చర్చలకు కీలక వేదికను అందిస్తుందని తెలిపారు. మరింతగా అనుసంధానమవుతున్న నేటి ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకు, సమగ్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ నాలుగు అంశాలు అత్యవసరమని వెల్లడించారు.

అనిశ్చితి, అవాంతరాలు ఎదురయ్యే సమయాల్లో నిరంతరం కొనసాగే, జవాబుదారీతనం, ప్రభావవంతమైన ప్రజాస్వామ్య పర్యవేక్షణకు బ్రిక్స్ దేశాల శాసన నిర్మాణ వ్యవస్థలను, సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుస్థిర పార్లమెంటరీ వ్యవస్థల ఆవశ్యకతను తెలియజేశారు. మారుతున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పురోగమించాల్సిన నజీవ వ్యవస్థలు పార్లమెంట్లని అభిప్రాయపడ్డారు. కేవలం రాజ్యాంగబద్ధమైన అధికారంలోనే కాక నిర్మాణాత్మకమైన చర్చలు జరపటం, ఏకాభిప్రాయాన్ని సాధించటం, పారదర్శకతను కాపాడటం, తాము ప్రాతినిధ్యం వహించే పౌరులకు జవాబుదారీగా ఉండటంలోనే పార్లమెంట్ల బలం దాగి ఉందన్నారు.

పార్లమెంటరీ నిర్వహణలో ఆవిష్కరణల పరివర్తనాత్మక పాత్రను స్పీకర్ స్పష్టం చేశారు. ఆవిష్కరణ అంటే కేవలం కొత్త సాంకేతికతలను స్వీకరించటం మాత్రమే కాదని.. ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత ప్రభావవంతంగా, పారదర్శకంగా, భాగస్వామ్యయుతంగా, స్పందించేవిగా తీర్చిదిద్దే నూతన ఆలోచనలు, పురోగతి సాధించే పద్ధతులు, సంస్థాగత సంస్కరణలు కూడా భాగమేనని తెలిపారు. నిర్మాణాత్మక మార్పులను అంగీకరించటం, సంస్థాగత సామర్థ్యాలను పెంపొందించుకోవటం ద్వారా పార్లమెంట్లు చర్చల నాణ్యతను పెంచగలవని, ప్రజల భాగస్వామ్యాన్ని మెరుగుపరచగలవని, పౌరుల మారుతున్న అంచనాలకు మరింత అర్థవంతంగా స్పందించగలవని పేర్కొన్నారు.

పార్లమెంటరీ సహకారంలోని అపారమైన సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తూ... బ్రిక్స్ దేశాల వైవిధ్యం వరిమితి కాదని, ఉమ్మడి ప్రయోజనాల కోసం వినియోగించుకోగల విలువైన ఆస్తి అని శ్రీ బిర్లా అభిప్రాయపడ్డారు. అనుభవాలను పంచుకోవటం, ఉత్తమ విధానాలను పరస్పరం మార్చుకోవటం, ఒకరి సంస్థాగత బలాల నుంచి మరొకరు నేర్చుకోవటం ద్వారా ఉమ్మడి సవాళ్లకు ఆవిష్కరణలతో కూడిన పరిష్కారాలను పార్లమెంట్లు సమష్టిగా రూపొందించగలవని అన్నారు. ఇటువంటి నిరంతర భాగస్వామ్యం మరింత సమానమైన, సమ్మిళిత, శాంతియుత తమైన ప్రపంచానికి పునాదులు వేసేందుకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు.

వరస్పర సహకార సంస్కృతిని పెంపొందించుకోవటమే పార్లమెంటరీ దౌత్య ప్రాథమిక సూత్రమని శ్రీ ఓం బిర్లా అన్నారు. ప్రతి దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రత్యేక దృక్పథాలను పూర్తిస్థాయిలో గౌరవించాలని స్పష్టం చేశారు. దేశాల మధ్య వైవిధ్యమైన పరిస్థితులు సంయుక్త లక్ష్యాల సాధనకు అడ్డుకాకూడదని అన్నారు. నిర్మాణాత్మక భాగస్వామ్యం ద్వారా విభిన్న దృక్పథాలను పరస్పర అభ్యాసానికి, ఉమ్మడి పురోగతికి అవకాశాలుగా మలచుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. అనుభవాలను సంయుక్త కార్యాచరణగా, పరస్పర అవగాహనను శాశ్వత విశ్వాసంగా, చర్చలను అర్థవంతమైన సహకారంగా మార్చాలని, నిబద్ధతను పునరుద్ధరించుకోవాలని బ్రిక్స్ సభ్య దేశాలకు శ్రీ ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు.

సుస్థిరాభివృద్ధి ఆవశ్యకతను ప్రస్తావిస్తూ... అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ ఒకదానికొకటి పరస్పరం దోహదపడే అంశాలని భారత తత్వశాస్త్రం భావిస్తుందని శ్రీ బిర్లా పేర్కొన్నారు. ఈ సమగ్ర దృక్పథం బ్రిక్స్ దేశాల పార్లమెంట్లకు కీలక మార్గదర్శక సూత్రంగా నిలుస్తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే విధంగా అభివృద్ధి ఉండకూడదని, పర్యావరణ బాధ్యత, సుదీర్ఘ సుస్థిరత, భావితరాల ప్రయోజనాలను కాపాడే ధ్యేయంతో ఆర్థిక-సామాజిక పురోగతి విధానాలు రూపొందాలని అన్నారు. సమృద్ధిగా గల, సమ్మిళిత, పర్యావరణ భద్రత గల ప్రపంచ నిర్మాణానికి ఈ దిశగా ఉమ్మడి కార్యాచరణ అత్యావశ్యకమని స్పష్టం చేశారు.

నేటి యువత ఆకాంక్షలను ప్రస్తావిస్తూ... ఆధునిక కాలంలో యువతకు నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయని, నూతనత్వాన్ని ఆవిష్కరించాలనే తపన, నిరూపించుకోవాలనే పట్టుదల వారిలో అధికంగా ఉన్నట్లు పరిశీలించానని శ్రీ ఓం బిర్లా తెలిపారు. వారి ఆకాంక్షలకు తగిన అవకాశాలు, గౌరవం, నైపుణ్యాలు వికసించే అనుకూల వాతావరణం కల్పించాలని పిలుపునిచ్చారు. యువత సమస్యలను వినటం, వారి ఆశలు, ఆందోళనలను అర్థం చేసుకోవటం, శక్తి, సృజనాత్మకతలను దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేసే మార్గాలను సుగమం చేయటం పార్లమెంట్ల ప్రాథమిక బాధ్యతని అన్నారు. యువతను సాధికారులను చేయటం కేవలం వ్యక్తిగత భవిష్యత్తుపై చేసే పెట్టుబడి మాత్రమే కాదని, ఆయా దేశాల ఉమ్మడి భవిష్యత్తు పట్ల నిబద్ధత చూపటమేనని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా బ్రిక్స్ కూటమిని 'పరిష్కారాల వ్యవస్థ'గా తీర్చిదిద్దాల్సిన అవసరముందని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా స్పష్టం చేశారు.

ఈ వేదిక విజయం కేవలం చర్చల విస్తృతిపై మాత్రమే కాకుండా, సాధించే ఫలితాలు, ప్రజల జీవితాల్లో తీసుకువచ్చే సానుకూల మార్పులపైనే ఆధారపడి ఉంటుందని లోక్‌సభ స్పీకర్ అన్నారు. చర్చలు కార్యాచరణగా మారాలని, సహకారం ద్వారా కొలవగల స్పష్టమైన ఫలితాలు రావాలని చెబుతూ... ఉమ్మడి భవిష్యత్తు కోసం భవిష్యత్-సన్నాహక ప్రణాళికతో ముందడుగు వేయాలని సభ్యదేశాల పార్లమెంట్లకు పిలుపునిచ్చారు.

బ్రిక్స్ దేశాల జాతీయ పరిస్థితులు, అభివృద్ధి ప్రాధాన్యతలు, దృక్పథాల్లో వైవిధ్యాలు ఉన్నప్పటికీ.. శాంతి, భద్రత, పరస్పర గౌరవం, సమాన అవకాశాలు, పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే ప్రాథమిక ఆకాంక్షలు అందరినీ ఒక్కటి చేస్తున్నాయని శ్రీ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. ఈ ఉమ్మడి ఆకాంక్షలే పరస్పర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, అర్థవంతమైన సహకారానికి బలమైన పునాదిని వేస్తున్నాయని అన్నారు. ఈ ఉమ్మడి లక్ష్యాల సాధనలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు, పరస్పర అవగాహనను పెంచేందుకు, సమష్టి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లేందుకు బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ క్రియాశీల వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ చర్చల ఫలితాల గురించి ప్రస్తావిస్తూ... సభ్యదేశాల మధ్య భాగస్వామ్య బంధాలను 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ మరింత పటిష్టం చేస్తుందని శ్రీ ఓం బిర్లా విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది మరింత సమ్మిళిత, శాంతియుత, సుస్థిర ప్రపంచ ఆవిర్భావానికి గణనీయంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ చర్చలు వరస్పర విశ్వాసానికి, అంతర్జాతీయ సహకారానికి సూతనోత్తేజాన్ని ఇస్తాయని, ప్రజలే కేంద్రంగా సాగే అభివృద్ధి పట్ల సమష్టి నిబద్ధతను బలోపేతం చేస్తాయని, ఉమ్మడి ఆకాంక్షలను శాశ్వత విజయాలుగా మార్చటంలో బ్రిక్స్ దేశాల పట్టుదలను పునరుద్ధరిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ హరివంశ్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్వాగతోపన్యాసం చేశారు.

డిసెంబర్‌లోగా 550 పడకల ఆసుపత్రి పూర్తి చేయాలి

నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు.. నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కలెక్టర్ హేమంత కేశవ పాటిల్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఆనువత్రి నిర్మాణ వనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. మిగిలిన పనులను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సులేమాన్, ఇంజనీరింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

సాంకేతికత మానవాళికి సేవ చేయాలి.. వైద్య సేవల్లో కరుణే కీలకం: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27:ఆంధ్రప్రదేశ్ విజయవాడలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవం (రూబీ జూబ్లీ) వేడుకల్లో భారత ఉప రాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యాసంస్థలు పరిశోధనలను బలోపేతం చేయాలని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, వైద్య రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలకు నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విశ్వవిద్యాలయానికి ఉప రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దిగ్గజ నాయకుడు డాక్టర్ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) దార్శనికతకు ఈ విశ్వవిద్యాలయం ప్రతిరూపమని పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆలోచనలు, ప్రజాసేవ ప్రాంతీయ హద్దులను దాటి విస్తరించాయని, దేశ ప్రజల సంక్షేమం పట్ల ఆయనకు ఉన్న విస్తృత నిబద్ధతను ఇవి ప్రతిబింబించాయని తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో వైద్య విద్య విస్తరించిన తీరును ప్రస్తావిస్తూ.. 2014కు ముందు 387గా ఉన్న వైద్య కళాశాలల సంఖ్య ప్రస్తుతం 846కు పెరిగిందని ఉప రాష్ట్రపతి తెలిపారు. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య సుమారు 51 వేల నుంచి 1.4 లక్షలకు పైగా చేరిందని, ఇది 172 శాతం పెరుగుదలని పేర్కొన్నారు. అలాగే పీజీ వైద్య విద్య సీట్లు సుమారు 31 వేల నుంచి 86 వేలకు పైగా పెరిగి 177 శాతం వృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

పరిశోధనలు, నూతన ఆవిష్కరణలే తదుపరి ప్రాధాన్య రంగాలని పేర్కొన్న ఉప రాష్ట్రపతి.. ప్రతిభావంతులైన విద్యార్థులు మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ పరిశోధకులు వైద్య విజ్ఞాన రంగానికి అందించే సేవల ద్వారా నోబెల్ బహుమతితో సహా ప్రపంచస్థాయి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ ఆరోగ్య సేవలు, టెలీమెడిసిన్, అధునాతన రోగ నిర్ధారణ సాంకేతికతలు వైద్య రంగాన్ని సమూలంగా మారుస్తున్నాయని శ్రీ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. అధునాతన పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు, పరిశోధకులకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి సూచించారు. సాంకేతిక అభివృద్ధి శాస్త్రీయ ధ్రువీకరణ, రోగుల భద్రత, సమాచార గోప్యత, నైతిక బాధ్యతలకు అనుగుణంగా సాగాలని స్పష్టం చేశారు. వైద్యుడు-రోగి మధ్య సంబంధంలో కీలకమైన కరుణ, మానవీయ అనుబంధాన్ని సాంకేతికత భర్తీ చేయలేదని ఆయన అన్నారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడంలో వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు చురుకైన పాత్ర పోషించాలని ఉప రాష్ట్రపతి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలపై పోరాటం సమష్టి బాధ్యతగా పేర్కొంటూ.. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి వైద్య రంగం నాయకత్వం వహించాలని కోరారు.

కార్యక్రమంలో భాగంగా అక్కడున్న వారితో కలిసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ఉప రాష్ట్రపతి ప్రతిజ్ఞ చేశారు. అలాగే విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ రూపొందించిన ప్రత్యేక సంచికను కూడా ఆయన విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్, రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి, విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్, జాతీయ వైద్య కమిషన్ వైద్య మూల్యాంకనం, రేటింగ్ బోర్డు అధ్యక్షుడు డాక్టర్ ఎంకే రమేశ్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మట్టిని కాపాడుకుందాం.. పంటలను రక్షించుకుందాం!

ఖేత్ బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన

నేల ఆరోగ్యమే రైతు భవిష్యత్తుకు పునాది



మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఖేత్ బచావో అభియాన్‌పై ఉప్పునుంతల మండల కేంద్రంలోని రైతు వేదిక సమావేశ మందిరంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

స్థానిక సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఏడీఏ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ రైతులకు అవగాహన కల్పించారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనునరించడం వంటి అంశాలను వివరించారు.

'సేవ్ ద సాయిల్, సేవ్ ఫార్మింగ్, సేవ్ ఫార్మర్స్' నినాదంతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్), వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ అభియాన్‌ను ప్రారంభించాయి. ఇందులో భాగంగా నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించాలని అధికారులు సూచించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట ఎరువులు, బైయోబియం, అజోటోబాక్టర్ వంటి జీవ ఎరువులను ప్రోత్సహించాలని తెలిపారు.

వర్షాధార, తక్కువ నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఆత్మ చైర్మన్ కట్టా అనంతరెడ్డి, గ్రామ సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసులు, డిప్యూటీ సర్పంచ్ శైలజ, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

తాగునీటి కటకట నుంచి బయటపడాలి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: నీటిని పొదుపుగా వాడాలని ఏకశిలా డిజి హై స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మంగళవారం 34 డివిజన్ శివనగర్ ఏకశిల డిజి హై స్కూల్, విద్యార్థుల ఆధ్వర్యంలో డివిజన్లో భారీ ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరు నీటిని సంరక్షిం చాలని నీటిని వృధా చేయరాదని ఎల్ ని నీ కారణంగా వర్షాలు లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని వారు ప్రజలకు తెలియపరిచారు.

నీటి కొరత ఏర్పడంతో తాగునీటికి కటకట ఏర్పడిందని మనందరం ఐక్యమత్యంగా నీటిని వృధా కాకుండా కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత అందరిపై ఉందని విద్యార్థులు ప్లే కార్డ్స్ తో ర్యాలీ నిర్వహించారు.

కూరగాయలు కడిగిన బియ్యం కడిగిన నీరు వృధా చేయకుండా ఇంట్లోని పూల మొక్కలకు వృక్షాలకు అట్టి నీటిని తరలించాలని దాంతో మనం పొదుపుగా నీరును వాడుకోవడం జరుగుతుందని విద్యార్థులు తెలియపరిచారు.

ర్యాలీలో ఏకశిలా డిజి హై స్కూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల భద్రతపై కస్తూర్బాలో అవగాహన

–జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: బాలల భద్రత, హక్కుల పరిరక్షణ, లైంగిక వేధింపుల నివారణ లక్ష్యంగా తొర్రూరులోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో సోమవారం 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్ మాట్లాడుతూ, పోక్సో చట్టం-2012పై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలకు సురక్షిత మైన స్పర్శ, అసురక్షితమైన స్పర్శ మధ్య తేడాను వివరించారు. ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ భద్రత, ఫిర్యాదు విధానాలపై అవగాహన కల్పించారు. బాలలు వేధింపులు లేదా ప్రమాదాలను ఎదుర్కొంటే భయపడకుండా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల సంబంధ 112కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చయ్య, న్యాయవాది ఎం. అశోక్, పాఠశాల ప్రిన్సిపల్ విజయ రత్నమాల, పోలీను సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేరుతో స్థాపించిన



డా॥ పట్టాభి కళా పీఠము

(ప్రతిభకు పట్టాభిషేకం)

(రి. 234/2010)

ప్లాట్ నెం. ఎ/404, శివ గ్రీన్ వ్యాలీ, గోరంట్ల, గుంటూరు - 522 034.

ఆహ్వానము

డా॥ పట్టాభి జయంతి –

పట్టాభి అవార్డ్స్–2025 ప్రదానోత్సవ సభ

(సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకం)

తేది : 14-11-2026 (2వ శనివారం)

వేదిక : పెన్షనర్ల భవనం

తాలూకా కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.

సమయం : ఉదయం 10 గం॥లకు

సభా కార్యక్రమం

సభాధ్యక్షులు :

డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్

అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము

ముఖ్య అతిథి :

గౌ॥ శ్రీమతి పాడపాటి తేజస్విని గారు

అధ్యక్షురాలు, ఆం.ప్ర. సృజనాత్మక, సాంస్కృతిక సమితి, అమరావతి

విశిష్ట అతిథి :

ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు

ఉపకులపతి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

చందమామతో కొడవటిగంటి విడదీయరాని అనుబంధం

అక్టోబర్ 28...కొడవటిగంటి కుటుంబరావు జయంతి

దాదాపు ముప్పై సంవత్సరాలుగా ''చందమామ'' సంపాదకవర్గంలో ముఖ్యుడిగా వుంటూ, 'చంద మామ' అభివృద్ధికి దోహదం చేసిన సుప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు. ''చందమామ'ను అభిమానించే అసంఖ్యాక పాఠకులు, అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా ఆయన నిలిచి పోయారు. కథకుడుగా, విమర్శకుడిగా, వ్యాస, నవలా రచయితగా ఆయన సాధించిన ఖ్యాతి తెలుగు పాఠక లోకానికి సుపరిచితమే. 'చందమామ'లో ఎవరు ఏ కథ రాసినా, ఆ కథకు మెరుగులు దిద్ది, అందం తెచ్చి, చదివింప జేసిన ఘనత ఆయనది. తన అనుభవాన్ని రంగరించి, సులభ భాషలో చందమామ పాఠకులకు ఆయన అందించిన వేలాది కథలు బాల సాహిత్యంలో ఆణి ముత్యాలు.

చక్రపాణి ఆశయాలను సాకారం చేసి, చందమామకు ప్రత్యేకత కల్పించి, తన ప్రతిభతో పాఠక లోకాన్ని తక్కిన పత్రికలను కాదని చందమామ వైపు ఆకర్షింప చేసిన మేధావి కొడవటిగంటి.

తెలుగు రచయితల్లో సుప్రసిద్ధ చెందిన వారిలో కొడవటిగంటి కుటుంబరావు ఒకరు. సమకాలీన మానవ జీవితాన్ని సునిశితంగా పరిశీలించి తన రచనలతో సహజత్వాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్త ఆయన. తెలుగు మధ్య తరగతి కుటుంబాలను (కొంత ఎక్కువగా బ్రహ్మణ కుటుంబాలను) నిశితంగా పరిశీలించి వాటికి సంబంధించి ఎన్నో ఇతివృత్తాలను తన కథల్లోకి ఆయన తీసుకొన్నారు. జాతకాలు ? వాటి ప్రభావాలు, మత పరమైన మూఢ విశ్వాసాలు, పిల్లల్ని పెంచటంలో పెద్దవాళ్ళ మూర్ఖ త్వాలు, సామాజిక స్పృహ లేని వ్యక్తులు, మధ్య తరగతి మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ ? పురుష సంబంధాలు, అందులో దాంపత్యేతర సంబంధాలు ఆయన రచనల్లో ప్రధాన వస్తువులు.

కొడవటి గంటి కుటుంబరావు (1909 అక్టోబర్ 28 – 1980 ఆగష్టు 17), ప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది. "కొకు" గా చిరపరిచితుడైన ఆయన తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది వేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యులు.

కుటుంబరావు గుంటూరు జిల్లా, తెనాలి లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తెనాలిలో పాఠశాల చదువు 1925 వరకు సాగింది. చిన్న వయసులోనే 1914లో తండ్రి, 1920లో తల్లి మరణించడంతో మేనమామ వద్ద పెరిగారు. ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకు పోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకట సుబ్బయ్య ద్వారా ఆయన సాహితీ రంగ ప్రవేశం జరిగింది. ఆ కాలంలోనే ఆయనకు పాశ్చాత్య సాహిత్య పరిచయం జరిగింది. పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసారు. కొద్ది కాలం లోనే వాటిని వదిలి పెట్టారు. 1925లో ఉన్నత విద్య పూర్తికాక ముందే 11 ఏళ్ళ పద్మావతితో



ఆయన పెళ్ళి జరిగింది. 1925 నుండి 1927 వరకు గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియేటు చదివాక, 1927-29 కాలంలో మహారాజా కళాశాల, విజయ నగరంలో బియ్యే ఫిజిక్సు చదివారు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్ గా మొదలు పెట్టాడు. బియ్యే చివరికి వచ్చేనరికి ఆయన నాస్తికునిగా మారిపోయారు.

1929లో కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఎస్.సి ఫిజిక్సులో చేరారు. 1930లో ఆయన తొలిరచన సినిమా ఓరియంటల్ వీక్లీలో ప్రచురితమైంది. ఆయన మొదటి కథ ప్రాణాధికం గృహలక్ష్మి మాన పత్రికలో అగ్రస్థానం పొందింది. కారణాంతరాల వల్ల ఎం.ఎస్.సి రెండో సంవత్సరం చదువు ఆగిపోయింది.

1931లో కొంతకాలం పాటు వరంగల్ లో ఉండి పిల్లలకు ప్రైవేట్లు చెప్పారు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణ శాస్త్రి, పిల్లలమర్రి సాంబశివ రావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపించి యువ పత్రికను ప్రారంభించారు.

1940 – 42 మధ్య కాలంలో ఆంధ్ర పత్రికలో పని చేసారు. ఆ సమయంలో జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942 లో నాలుగు నెలల పాటు ఒక మెటలు కర్మాగారంలో పని చేసారు. 1942 జూలై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కాపీ రైటరుగా పనిచేసారు.

1944లో ఒడిషా జయపూరులో ఇన్స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఆర్నెల్ల పాటు ఫోర్మనుగా పనిచేసారు. 1948లో మూణ్ణెల్ల పాటు బొంబాయి ఎయిర్ ఇండియా కార్యాలయంలో ఎకౌంట్సు క్లర్కుగా పనిచేసారు. 1948లో ఆంధ్రపత్రిక దినపత్రికలో చేరి 1950-51లో వారపత్రిక సంపాదకత్వం నిర్వహించారు.

జగత్తులో స్థలము, కాలము అనే రెండు కొలతలే కాకుండా బుద్ధి అనేది కొలతగా పనిచేస్తుంది అనే సిద్ధాంతాన్ని... బుద్ధికొలత వాదం అనే పేరుతో ఆయన ప్రతిపాదిం చారు. ఈ ప్రతిపాదన అనేక చర్చలకు దారితీసింది. 1937లో రాసిన ఆయన రచన కారుణ్యం ముందు మాటలో...

నాకు ఒకటే ఆశయం ? నా రచనల వల్ల కూడా మనోవికాసం పొంద దగిన వాళ్ళు తెలుగు వాళ్ళలో ఉండి తీరాలి. వారందరూ నా కథలు చదవాలని నా కోరిక. వారందరికీ నా రచనల మీద ఎంత త్వరగా ఏవగింపు కలిగితే అంత ఉపయోగం చేసిన వాణ్ణవుతాను తెలుగు సారస్వతానికి. అప్పటికి తెలుగు సారస్వతానికి నాతో పని అయిపోతుంది.

నా కథలు చిరస్థాయిగా ఉండిపోవాలనే ఆశ నాకు ఏకోశానా లేదు. ఇంకా ఎప్పుడో పుట్టబోయే వాళ్ళ కోసం రాస్తున్నాననే అహంకారం కూడా నాకు లేదు. నేను ఆకాశం నుంచి ఊడిపడలేదు... అని తన మనసు లోని మాటను స్పష్టం చేశారు.

1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చందమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి నిర్విరామ కృషి సలిపారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

పేదరికాన్ని జయించే పదునైన ఆయుధం విద్య మాత్రమే

లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్

హైదరాబాద్, అక్టోబర్ 27: పేదరికాన్ని జయించడానికి కావలసిన పదునైన ఆయుధం ఉన్నత చదువు మాత్రమే అని ప్రముఖ కవి, రచయిత, వక్త, విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేదరికమే చదువుకోవాలనే కసిని పెంచుతుందని, కనీసం డిగ్రీ వరకు ఉన్నత శ్రేణిలో విద్యాభ్యాసం చేసి అనుకున్న ఉద్యోగ ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయిలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడానికి క్రమశిక్షణతో కూడిన కృషిని చేయాలని అన్నారు. సక్రమమైన దినచర్య ఉన్న విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. పేదరికంలోంచి ధృవతారగా ఎదిగిన అబ్దుల్ కలాం లాంటి వారు మనకు ఆదర్శంగా నిలుస్తూ దారి దీపం వలె మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు. పదవ తరగతి తర్వాత విద్యార్థుల జీవితం ఓ కొత్త మార్గాన్ని ఏర్పరచుకుంటుందని చెప్పారు. మన భవిష్యత్తు మన చేతుల్లో ఉందని, మనల్ని మనకు పరిచయం చేసేది మనం పొందిన విద్య మాత్రమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా శిక్షకులు దా శ్రీనివాస్, గణేశ్‌లు చదువు అవసరాన్ని, తల్లితండ్రుల పాత్రను చక్కగా వివరించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి రాసిన క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ పుస్తకాన్ని పాఠశాల లైబ్రరీకి బహుకరించారు.

రైతుల కంటతడి రాష్ట్రానికి మంచిది కాదు : ఆల వెంకటేశ్వర్ రెడ్డి



మహబూబ్‌నగర్, అక్టోబర్ 27: రైతుల కంటతడి రాష్ట్రానికి మంచిది కాదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు గ్రామంలో ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం పంటలు కూడా కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. డోకూరులో జానకమ్మ కౌలుకు తీసుకొని సాగు చేస్తే మొత్తం పంట ఎండిపోయింది.

జానకమ్మ లాంటి రైతు కంటతడి పెడితే రాష్ట్రానికి మంచిది కాదన్నారు. ఐదు లక్షలు పెట్టుబడి పెడితే ఐదు రూపాయలు కూడా రాలేదన్నారు. గతంలో కోయిల్ సాగర్ నుండి దేవరకద్ర పెద్ద చెరువుకు నీళ్ళు వదిలే వాళ్లం. అక్కడి నుండి వరుసగా చెరువులు నిండేవన్నారు. ప్రజలకు ఉపయోగపడని పదవులు ఎందుకు అని ప్రశ్నించారు.

కోయిల్ సాగర్ నుండి లగచర్లకు నీళ్లు తీసుకెళ్లేందుకు సర్వే నడుస్తుంది. కోయిల్ సాగర్ నుండి నీటి తరలింపు ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. అలాగే రైతులకు ఎకరాకు యాభై వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చైనా చొరబాటు అంటూ తప్పుడు ప్రచారం.. కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ, అక్టోబర్ 27:అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా చొరబడిందంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, దీనిపై కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. చైనా వాహనాలు భారత భూభాగంలోకి ప్రవేశించాయని, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై చైనా నియంత్రణ సాధించిందని, సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న భారత సైనికులకు అవసరమైన సరఫరాలు అందడం లేదని సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి.

ఆ వీడియోలను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతూ చౌధురి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలు నిజమైనవి కావని భారత సైన్యం తేల్చి చెప్పింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను చైనా స్వాధీనం చేసుకుందని సీనియర్ సైనిక అధికారి లెఫ్టినెంట్ జనరల్ గిరీష్ కాళియా చెప్పినట్లు ప్రచారమైన వీడియోను భారత సైన్యం ఖండించింది. ఆ వీడియోను ఏఐ సాయంతో మార్పులు చేసి రూపొందించినట్లు స్పష్టం చేసింది. గతంలో జరిగిన మీడియా సమావేశానికి సంబంధించిన దృశ్యాలకు తప్పుడు వ్యాఖ్యలను జోడించినట్లు వెల్లడించింది

జగన్.. జనజీవన స్రవంతిలోకి రావాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 27: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. జనజీవన స్రవంతిలోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 'జనజీవన స్రవంతిలోకి రమ్మని గతంలో నక్సలైట్లకు చెప్పాను. వచ్చినవాళ్లు బాగుపడ్డారు. రాని వాళ్లు ఏమయ్యారో మీకు తెలుసు కదా' అని వ్యాఖ్యానించారు. జగన్ కూడా ఇలానే జనజీవన స్రవంతిలోకి రావాలన్నారు. ఈరోజు (మంగళవారం) మిడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా గొడ్డలి పార్టీ దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. వాళ్ల కుటుంబంలోనూ సంక్షోభాన్ని సృష్టించుకున్నారని విమర్శించారు. ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'జగన్ ఆలోచన ప్యాలస్ కోసం.. మా ఆలోచన, తపన.. ప్రజలు. పేదల కోసం' అని చెప్పుకొచ్చారు. నేరాలు, ఘోరాలు చేసే పార్టీ సృష్టించే అడ్డంకులను సమర్థంగా దాటుకుని ముందుకెళ్తామన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూడా చేయనంత కసరత్తు ఈ స్థానిక ఎన్నికల్లో చేశామని సీఎం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులపై గతంలో వివిధ సందర్భాల్లో కసరత్తు చేశామని... కానీ ఈసారి స్థానిక ఎన్నికల్లో చాలా కసరత్తే చేశామని వెల్లడించారు. ఎంపీటీసీల స్థాయిలో సీట్ల సర్దుబాటు.. అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిగా పని చేయడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుగా ముందుకెళుతున్నామన్నారు. ఇక స్థానిక సంస్థల్లోనూ కూటమి గెలుపు ద్వారా ట్రిపుల్ ఇంజిన్ స్పీడ్‌తో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మద్దతు పలికి ట్రెండ్ సెట్ చేయాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో సీట్లు ఇవ్వలేని వాళ్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించేందుకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రాపర్టీపై వివాదం.. హోటల్‌లో అయిదుగురి కాల్చివేత

గౌహతి: అస్సాంలోని గౌహతి(ఉబీలిజీప్టజీబితి)లో దారుణం జరిగింది. ఓ హోటల్‌లో అయిదురు కాల్చివేతకు గురయ్యారు. ప్రాపర్టీ ఓనర్, లీజ్‌హోల్డర్ మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. హోటల్ బిలాస్ ఇన్‌లో రాత్రి 9 గంటలకు కాల్పులు జరిగాయి. అస్సాం పోలీసు ప్రధాన కార్యాలయానికి 2 కిలోమీటర్ల దూరంలో జరిగింది. ఆరుగురికి బుల్లెట్ గాయాలు కాగా, దాంట్లో అయిదుగురు మృతిచెందినట్లు పోలీసు కమిషనర్ పార్థసారథ మహంత తెలిపారు. నిందితుడిని గణకంట గగోయ్‌గా గుర్తించారు. ప్రాపర్టీ లీజ్‌హోల్డర్ అతను. ఘటన జరిగిన గంటలోనే అతన్ని పల్టన్ బజార్ ఏరియాలో అదుపులోకి తీసుకున్నారు. .32 బోర్ లైసెన్స్ పిస్తోల్‌ను వాడారు. దాన్ని సీజ్ చేశారు. కేసులో దర్యాప్తు జరుగుతున్నది. హోటల్ లీజు అగ్రిమెంట్ అంశంలో గొడవ జరిగిందని, ప్రాపర్టీ వివాదం నేపథ్యంలో ఫైరింగ్ జరిగినట్లు మహంత తెలిపారు. మృతిచెందిన అయిదుగురు వ్యక్తులు హోటల్ ఓనర్‌కు సంబంధితులే. దాంట్లో నలుగురు ఒకే కుటుంబసభ్యులు. ఏడాది క్రితం గగోయ్ హోటల్‌ను లీజుకు తీసుకున్నాడు.

లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: లారీ ఢీకొని బీటెక్ విద్యార్థి అభిలాష్ రెడ్డి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సీవీఆర్ కాలేజీలో బీటెక్ చదువుతున్న ఏమిరెడ్డి అభిలాష్ రెడ్డి తన మిత్రుడిని హయత్‌నగర్ బస్టాండ్‌లో దింపి తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆపదలో ఉన్నవారికి రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో మెగా రక్తదాన శిబిరం.



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27:(నేటినిజం ప్రతినిధి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం ప్రాణదానంతో సమానమని,ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున వేములవాడ లోని మహా లింగేశ్వర్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తో కలసి శిబిరాన్ని ప్రారంభించగా, అమరవీరుల స్ఫూర్తితో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు , మిడియా ప్రతినిధులు 400 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.ఈసందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని,పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేసుకోవడమే కాకుండా, సమాజం పట్ల సేవాభావం, బాధ్యతను పెంపొందించుకునేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సెలవులు లేకుండా నిరంతరం విధులు నిర్వహించే శాఖ పోలీస్ శాఖ అన్నారు.ప్రజలను సమన్వయం చేసుకుంటూ, చట్టానికి అనుగుణంగా సేవలందిస్తూ, ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో మితో మేమున్నాం అనే భరోసాను ప్రజల్లో కల్పిస్తూ పోలీస్ శాఖ ముందుకు సాగుతోందని తెలిపారు.అయితే ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది ప్రజల కోసమేనని, నేరస్తుల పట్ల కాదని స్పష్టం చేశారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు.'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు, యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పిస్తూ, సమాజాన్ని సురక్షితంగా ఉంచేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.

గతంలో పోలీసింగ్ విధానానికి, ప్రస్తుతం అమలవుతున్న పోలీసింగ్ విధానానికి ఎంతో తేడా ఉందన్నారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుంటూ, సామాజిక సేవలో భాగస్వాములవుతూ పోలీసులు ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ పనితీరును ముఖ్యమంత్రి సైతం అభినందించారని పేర్కొన్నారు.ఇతరులకు సేవ చేసే మనస్తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.జిల్లా అంతర్గత భద్రతలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులు త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. జిల్లాలో పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బిగితే తెలిపారు.

అందులో భాగంగా మంగళవారం వేములవాడలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రక్తదానం అత్యంత విలువైన సామాజిక సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం ప్రమాదంలో పడకుండా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, ఇతరులకు ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ లు శ్రీనివాసులు, నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ శేఖర్, సి.ఐ వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు సురేష్, రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గూడూరి రవీందర్, వేణు కుమార్, పాతురి సంజీవ రెడ్డి, శ్రీధర్,డా. సంతోష్,ఎస్.ఐ లు, యువత, మిడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్' క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.. నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, అక్టోబర్ 27: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ లోని నవ్యభారతి స్కూల్లో డిసెంబర్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.

ఈ మేరకు కలెక్టర్ మంగళవారం ఆయా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు టేబుల్ టెన్నిస్ క్రీడలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో అన్ని రాష్ట్రాల నుంచి 150 క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. క్రీడలను విజయవంతంగా నిర్వహించి రాష్ట్రంలో జిల్లాకు పేరు ప్రాఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల విజయవంతం కోసం నవ్య భారతి స్కూల్లో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.